


Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 274 | శుక్రవారం 27 మార్చి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ఘోర బస్సు ప్రమాదం

- మార్కాపురం జిల్లాలో టిప్పర్- ట్రావెల్స్ బస్సు ఢీ
- బస్సులో చెలరేగిన మంటలు
- 14 మంది సజీవదహనం
- 15 మంది ప్రయాణికులకు గాయాలు..
- మార్కాపురం ప్రభుత్వాస్పత్రికి క్షతగాత్రుల తరలింపు
- బస్సు హరేకృష్ణ ప్రయివేటు ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తింపు
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం : ఏపీ సీఎం ఆదేశం



**మార్కాపురం - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయివేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు మూలమలుపు తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది. దీంతో బస్సులో క్షణాల్లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 14మంది ప్రయాణికులు సజీవదహనమయ్యారు. 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మార్కాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన బస్సు హరేకృష్ణ ప్రయివేటు ట్రావెల్స్ బస్సుగా గుర్తించారు. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నట్టు సమాచారం. మృతులు కనిగిరి, పామూరు ప్రాంతాలకు చెందిన వారిగా అధికారులు గుర్తించారు. ఈ ప్రమాదంపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతివ్యక్తం చేశారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను

- మిగతా 2లో..



# అటకెక్కిన మైనారిటీ సంక్షేమం

## - సామాజికంగా, ఆర్థికంగా దిగజారిన మైనారిటీలు

**డా. యం. సురేష్ బాబు, అధ్యక్షులు, ప్రజాసైన్స్ వేదిక**

భారతీయ రాజకీయ ప్రక్రియలో ముస్లింలు, మైనారిటీ సమూహాల లక్ష్యాలు ప్రత్యామ్నాయ వ్యూహాలు గత పన్నెండు సంవత్సరాలుగా చతికిలపడ్డాయి. భారతదేశంలోని మైనారిటీలకు మూడు రాజకీయ ఎంపికలు ఉన్నాయి, వారు లౌకిక ధోరణిలో మైనారిటీల పట్ల సానుభూతిగల పార్టీలలో ఒకదానిలో చేరవచ్చు. లేదా వారు పార్టీ అనుబంధంతో సంబంధం లేకుండా సానుభూతి గల వ్యక్తుల ఎన్నికను నిర్ధారించే నిష్పక్షపాత ఒత్తిడి సమూహం ద్వారా పని చేయవచ్చు లేదా వారు తమ స్వంత రాజకీయ పార్టీని ఏర్పాటు చేసుకొని సంకీర్ణ ప్రభుత్వంలో అధికార సమతుల్యతను కొనసాగించడం ద్వారా ప్రయోజనాలను పొందేందుకు ప్రయత్నించవచ్చు.

స్వాతంత్ర్య ఉద్యమం నుంచి, భారత జాతీయ కాంగ్రెస్ ముస్లింలతో రాజకీయ కూటమిలో ఉంది. కాంగ్రెస్‌తో జమియాత్ సహకారం రాజకీయ బేరసారాన్ని కలిగి ఉంది, దీనిలో ప్రార్థనా స్థలాలు, మతపరమైన దానం, ముస్లిం వ్యక్తిగత చట్టం ఇతర సంస్థలు మరియు ఇస్లామిక్ సంస్కృతి అంశాలు నిర్వహించబడతాయని భావించి ఉలేమాలు తమ మద్దతును అందించారు. కాంగ్రెస్ ప్రధాన మంత్రులకు ముస్లింల పట్ల స్పష్టమైన ఉదారవాదం లౌకిక దృక్పథం సామాజిక సామరస్యత ఉండేది. కాంగ్రెస్ ముస్లిం రాజకీయ నాయకులను వివిధ అభిరుచులను ఆకర్షించింది. ఏది ఏమైనా స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి కాంగ్రెస్‌కు నిజమైన ప్రత్యామ్నాయం లేదు. ఆ విధంగా కొత్త రాజకీయ ప్రక్రియలో ముస్లింల భాగస్వామ్యానికి సహజ సాధనంగా స్వాతంత్ర్యం ప్రారంభంలోనే కాంగ్రెస్ ఉద్భవించింది. కాంగ్రెస్ పార్టీ లౌకికవాదానికి మైనారిటీల రక్షణకు అత్యంత బలంగా కట్టుబడింది. తెలుగుదేశం పార్టీలో ముస్లిం నాయకత్వం లేకపోవడం. రాష్ట్రంలోని అతిపెద్ద మైనారిటీ సామాజిక వర్గంతో విభేదించడం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు వైఫల్యానికి ఇది నిదర్శనం. రాష్ట్రంలో ముస్లింలు మొత్తం జనాభాలో 9 శాతం కాగా ఓటర్లలో 11 శాతం ఉన్నారు. రాజకీయ పార్టీలు తమ కుల, వర్గాలకు పెద్దపీట వేస్తూ బీసీ భేరి ఎస్సీ ఎస్టీ భేరి నిర్వహిస్తున్నప్పుడు ప్రస్తుత తరుణంలో మైనారిటీ వర్గాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించడంలో తెలుగుదేశం పార్టీ చేయకపోవటం విచిత్రం. బీజేపీ ప్రభుత్వం తో పొత్తు పెట్టుకోవడం నాయుడు మోడీని పొగడడం పెద్ద తప్పు

- మిగతా 2లో..

# అమరావతికి చట్టబద్ధతకు తీర్మానం

- పిఎన్‌జి వినియోగదారులకు సబ్సిడీ పొడిగింపు
- కోచింగ్ సెంటర్ల నియంత్రణ కోసం బిల్లు
- కేబినెట్ నిర్ణయాలు



**అమరావతి - సూర్య వాస్తవం**

రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు వీలుగా ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్-5ను సవరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేయాలని నిర్ణయించారు. దీనికోసమే శనివారం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించనున్నారు. కేబినెట్ నిర్ణయాలను మీడియాకు వివరించిన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖమంత్రి కొలుసు పార్థసారధి విభజన చట్టం సెక్షన్-5లోని సబ్ సెక్షన్-(2)లో అమరావతి వద్ద అనే పదాన్ని చేర్చాలని, సెక్షన్-5 వివరణకు అమరావతి అనగా ఎపి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఎపి సిఆర్‌డిఎ)

- మిగతా 2లో..

## ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ పదిలం

- దేశంలోనే మొదటిసారి మహిళలకు ఆస్తిలో సమానహక్కు కల్పించిన ఎన్టీఆర్
- ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పాలన
- సమగ్ర ప్రణాళికతో ఆదర్శ నియోజకవర్గంగా కుప్పం
- పెద్ద ఎత్తున పరిశ్రమల రాకతో కుప్పానికి మహర్దశ
- 3వ రోజ కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి

2లో



## భట్టి విక్రమార్క కుమారుడు, కోడలిని ఆశీర్వదించిన రాయిబరేలి కాంగ్రెస్ పార్టీ నాయకులు అతుల్ సింగ్

2లో

- కొత్తజంటకు ఆశీస్సులు అందజేసిన 'సూర్య వాస్తవం' చైర్మన్ ఎన్.ఆరిఫ్ అలీ

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## మానోబంధు కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ మద్దతు

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

మానోబంధు జాతీయ అకాడెమిక్ కోఆర్డినేటర్ డా. యం . సురేష్ బాబు మరియు జె. నిఖిల్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకృష్ణ రెడ్డిని కలిసి మానోబంధు కార్యక్రమానికి సంస్థాగత మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డా. సురేష్ బాబు, మానోబంధు సంస్థ ద్వారా వీధుల్లో తిరిగే మానసిక రోగులతో బాధపడుతున్న నిరాధారులను

- మిగతా 2లో..



# అమరావతికి చట్టబద్ధతకు తీర్మానం

(మొదటిపేజీ తరువాయి)

చట్టం-2014 కింద నోటిఫై చేసిన రాజధాని నగర ప్రాంతాలు కలిసి ఉంటాయి' అనే పదాలను చేర్చాలని నిర్ణయించినట్లు చెప్పారు. పో లవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులైన కుటుంబాలకు భూమి, కాలనీల రూపంలో పునరావాసం కల్పించేందుకు రంపచోడవరం డివిజన్, పోలవరం జిల్లాలోని గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి మండలాల్లో గుర్తించిన భూములకు భూసేకరణ చట్టం-2013లోని సెక్షన్లు 26 నుంచి 30, ఫస్ట్ షెడ్యూల్ ప్రకారం ఎకరాకు రు.12.50 లక్షలు చెల్లించనున్నట్లు చెప్పారు. దీనికోసం 4520.52 ఎకరాల సేకరించాల్సి ఉంటుందని, మొత్తం రూ.565.06కోట్లు అవసరమవుతాయని అంచనా వేశామని తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేట్ కోచింగ్ సంస్థల నియంత్రణ, రిజిస్ట్రేషన్, పర్యవేక్షణ కోసం 'ది ఆంధ్రప్రదేశ్ కోచింగ్ ఇన్‌స్టిట్యూషన్స్(రెగ్యులేషన్ అండ్ కంట్రోల్) రూల్స్-2026 ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసేందుకు ఆమోదం తెలిపామన్నారు. ఈ నిబంధనల ప్రకారం అన్ని కోచింగ్ సెంటర్లు రిజిస్ట్రేషన్ తప్పనసరి చేసుకోవాలని వెల్లడించారు. దీపం-2 పథకం కింద ఎల్‌పిజి కనెక్షన్ లబ్ధిదారులకు అందుతున్న విధంగానే ఇక నుంచి పిఎన్‌జి కనెక్షన్ వినియోగదారులకు కూడా సమానమైన సబ్సిడీని వర్తింపచేస్తామన్నారు. హైకోర్టు ప్రతిపాదించిన విధంగా 96 కొత్త కోర్టులు ఏర్పాటు చేయడానికి, అవసరమైన 1730 పోస్టులు సృష్టించడానికి ఆమోదం తెలిపినట్లు మంత్రి చెప్పారు. పోలవరం లిఫ్ట్ స్కీం పనిని కొనసాగించేందుకు మేఘాకు అనుమతి ఇచ్చామన్నారు. కడప జిల్లాలో 2400 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించనున్న కొప్పాలు పంప్డ్‌హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టు కోసం గండికోట రిజర్వాయర్ నుంచి నీటిని కేటాయించే ప్రతిపాదనను ఆమోదించామన్నారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసే పునరుత్పాదక ఇంధన తయారీ జోన్ల(సోలార్ ప్యానెల్, బ్యాటరీ వంటి తయారీ పరిశ్రమలు)కు నోడల్ ఏజెన్సీగా ఇక నుంచి నెడ్‌క్యాప్ ఉండేందుకు జారీ చేసిన జివోలను ఆమోదించామన్నారు. అమరావతి రాజధానిలో విద్యుత్ పనులకు వసూలు చేస్తున్న 15శాతం చార్జీలను 2.5శాతానికి తగ్గించేందుకు ఆమోదం తెలిపామని చెప్పారు. సుజ్లాన్ ఎనర్జీ, ఆక్సిస్ ఎనర్జీ ప్రాజెక్టుల పూర్తిచేసే గడువును మరో రెండేళ్లు పెంచామని తెలిపారు.

**భూ కేటాయింపులు**

ఇకోరన్ ఎనర్జీ కంపెనీకి నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం గుతుపల్లి, ఆర్‌ఎస్ రంగాపురం, కోతపల్లె, ఎం పెండేకల్, ఆర్ రంగాపురం, గుతుపల్లి, కోలుముల్లపల్లి తదితర గ్రామాల్లో 61.74 ఎకరాల ప్రభుత్వ భూమి లీజు పద్ధతిలో 30 ఏళ్లు కేటాయింపు.


అల్ట్రా మెగా సోలార్ పార్కుల కోసం కడప జిల్లా పొన్నంపల్లి గ్రామంలో 466.54 సెంట్ల ప్రభుత్వ భూమి కర్నూలు జిల్లా సకునాల గ్రామంలో 737.66 సెంట్ల ప్రభుత్వ భూమిని ఎపి సోలార్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు లీజు పద్ధతిలో అప్పగింత. నంద్యాల జిల్లా అర్బన్ మండలం నూనేపల్లెలో 2ఎకరాల ప్రభుత్వ భూమిని టిడిపి కార్యా లయం నిర్మాణానికి లీజు పద్ధతిలో ఎకరానికి రూ.1000ల చొప్పున 33 ఏళ్లు కేటాయింపు.

**60మీ. ఎత్తుకు ఎస్ఆర్‌ఎం వర్శిటీ భవనాలు**

గుంటూరు జిల్లా నీరుకొండలో ఎస్ఆర్‌ఎం ప్రైవేట్ యూనివర్సిటీకి అకడమిక్ భవనాల నిర్మాణం కోసం 60 మీటర్ల ఎత్తు వరకు నిర్మించేలా మంత్రిమండలి అనుమతి ఇచ్చింది. నిబంధనల ప్రకారం విద్యాసంస్థల భవనాలు 30 మీటర్ల ఎత్తు వరకే ఉండాలని , అయితే వర్సిటీలో ఆధునిక, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, విద్యార్థుల రద్దీకి తగ్గట్లు భవ నాలు నిర్మించేందుకు ఈ ఎత్తు సడలింపు అవసరమని ప్రభుత్వం భావించినట్లు చెప్పారు.

# మానోబంధు కార్యక్రమానికి తెలంగాణ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ మద్దతు

(మొదటిపేజీ తరువాయి)



రక్షించడం, పునరావాసం కల్పించడం, సమాజంలో తిరిగి కలపడం వంటి మానవతా కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమాలను కమ్యూనిటీ సర్వీస్ ప్రోగ్రాములు, సోషల్ ఇంటర్న్‌షిప్‌లు, విస్తరణ కార్యకలాపాలలో భాగంగా చేర్చేందుకు ఉన్నత విద్యాసంస్థలను ప్రోత్సహించాలని మండలిని కోరారు. ప్రొఫెసర్ బాలకృష్ణ రెడ్డి, మానోబంధు చేస్తున్న సేవలను అభినందించి, ఇది బలహీన వర్గాల గౌరవం మరియు మానవ హక్కులను కాపాడే జాతీయ స్థాయి సేవ అని పేర్కొంటూ పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు.మానోబంధు కార్యక్రమం అక్టోబర్ 26, 2021న ప్రారంభమై, జూన్ 2022లో ట్రస్ట్‌గా నమోదు అయింది. తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ప్రభుత్వ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తోంది. ఈ కార్యక్రమం వీధుల్లో తిరిగే మానసిక రోగులను గుర్తించి, వారికి చికిత్స మరియు పునరావాసం కల్పించడంపై దృష్టి సారిస్తోంది.. ప్రారంభం నుండి ఇప్పటి వరకు మానోబంధు సుమారు 58 రెస్క్యూ డ్రైవ్‌లు నిర్వహించి, 380 మందికి పైగా వ్యక్తులను రక్షించింది. వారిలో దాదాపు 290 మందిని వారి కుటుంబాలతో తిరిగి కలిపింది. మిగిలినవారికి సంరక్షణ కేంద్రా లలో పునరావాసం కల్పిస్తోంది. ఈ కార్యక్రమానికి మున్సిపల్, పంచాయతీరాజ్ , పోలీస్ సామా జిక సేవ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు మద్దతు అందిస్తున్నారు. ఉన్నత విద్యాసంస్థలతో భాగస్వామ్యం ద్వారా విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు సమాజ సేవను మరింత బలోపేతం చేయవచ్చని డా. సురేష్ బాబు విశ్వాసం వ్యక్తం చేశారు.

# భట్టి విక్రమార్క కుమారుడు, కోడలిని ఆశీర్వదించిన రాయిబరేలి కాంగ్రెస్ పార్టీ నాయకులు అతుల్ సింగ్

## - కొత్తజంటకు ఆశీస్సులు అందజేసిన 'సూర్య వాస్తవం' చైర్మన్ ఎన్.ఆరిఫ్ అలీ

**హైదరాబాద్- సూర్య వాస్తవం :**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య, సాక్షిల వివాహం జరిగిన విషయం విధితమే.... గురువారం నాడు రాయబరేలి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అతుల్ సింగ్, సూర్య వాస్తవం చైర్మన్ ఎన్. ఆరిఫ్ అలీ, మైనార్టీ నాయకులు ఇంతియాజ్, డాక్టర్ శంకర్ లతో వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు. నూతన వధూవరులను ఆశీర్వదించి జంటను దీవించారు.

# అటకెక్కిన మైనారిటీ సంక్షేమం

(మొదటిపేజీ తరువాయి)

అని విశ్లేషకులు అంటున్నారు. పార్టీలో ముస్లిం నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో టీడీపీ అధినేత పెద్దగా ఏమీ చేయలేదని, కొన్నేళ్లుగా అది గణనీయంగా క్షీణించిందని, మైనారిటీ వర్గంతో పార్టీకి ఉన్న సంబంధాన్ని ఎలాంటి సాయం చేయలేదని వారు భావిస్తున్నారు. గతంలో మైనారిటీ శాఖ బడ్జెట్ పెంచడం, ప్రొఫెషనల్ కాలేజీలు మంజూరు చేయడం, మసీదు నిర్మాణం, మరమ్మతులు చేయడం, శ్మశాన వాటికల చుట్టూ గోడలు కట్టడం, షాదీఖానాలు కట్టడం వంటి వాటి ద్వారా ముస్లింలను ప్రలోభ పెట్టె ప్రయత్నాలు టీడీపీ చేసింది.చంద్రబాబు నాయుడు ముస్లింలలో బాధాకరమైన భావాల లోతును గ్రహించడంలో విఫలమయ్యాడు అలాగే అధికారం కోసం బిజెపితో తన మద్దతును కొనసాగించాడు. కూటమి ప్రభుత్వం ముస్లింలలో ప్రబలుతున్న పేదరికం, నిరక్షరాస్యత సామాజిక సమస్యలు వంటి వారి సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు. ఇక తెలంగాణాలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికల సమయంలో సీయం రేవంత్ రెడ్డి ఆఘమేఘాల మీద భారత క్రికెట్ మాజీ కెప్టెన్ పూర్వ యంపీ అజారుద్దీన్ మంత్రిగా చేయడం ఇంతవరకు ఆయనకు ప్రోటో కాల్ లేకపోవడం ఇంకా త్రిశంకు స్వర్గంలో ఉన్నారు. గత ఇరవై ఏడు నెలలుగా మైనారిటీ సంక్షేమానికి తగినంత నిధులు కేటాయించక పోవడం. రాజ్యసభలో ఉన్న రెండు ఎంపీ సీట్లల్లో ఒక్కటైనా సీటు ఇస్తారని బీసీలు, మైనారిటీలు ఆశించారు. తన మిత్రుడు నోట్లో నాలుకలేని వారిని యంపీగా చేసి బిసిలకు మైనార్టీలకు దూరమయ్యారు. ఆధిపత్య శక్తులు తమ దామాషాకు, మూడు నాలుగు రెట్ల అవకాశాలను నొక్కేస్తున్న నేపథ్యంలో, గత ఏడు దశాబ్దాల రాజ్యాంగ పాలన లో, ఎవరి హక్కుల కోసం వారు, ఎవరి ఆధిపత్యం కోసం వారు పరిమితం అయిపోతుండగా, యితరులకు కరివేపాకు లాగే మిగిలి పోతున్న బీసీ మైనారిటీ వర్గం, తమ హక్కులు తాము దక్కించుకోవాలంటే ప్రముఖంగా చేయవలసింది ఏమిటి అనే దానికి సరైన సమాధానం కావాలి. బీసీ కులాల అస్తిత్వ నిర్మాణం చిక్కబడాలి. బీసీ కులాల మధ్య అంతర్గత ఐక్యత పెరగాలి. ఈ రెండూ జరగడానికి వీలుగా, దామాషా హక్కుల కోసం సమిష్టి కృషి కొనసాగిస్తునే, దొరుకుతున్న అవకాశాలు బీసీ కులాల మధ్య సమానంగా పంపిణీ జరగాలి. సరైన నాయకత్వ నిర్మాణం బీసీలకు కావాలి. జాతీయ స్థాయిలో, బీసీలకు సరైన గుర్తింపు దొరకాలి. అది జాతీయ స్థాయిలో, బీసీ సంఘాన్ని వ్యవస్థీకృతం చేయకుండా వీలుకాదు. ఎంత కృషి చేయకలిగిన ఒకరిద్దరి, లేక కొందరు పరిమిత కృషి మాత్రమే సరిపోదు. వ్యవస్థీకృత నిర్మాణం ద్వారా, బీసీల కీలక సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు జరగాలి. అంతిమంగా, బీసీ నాయకత్వంలో బలమైన రాజకీయ వేదిక నిర్మాణం జరగాలి. తద్వారా జాతీయ స్థాయిలో బీసీలకు రాజ్యాధికారం చేపట్టాలి. దాంట్లో ఎవరి దామాషా హక్కులు వారికి చెందాలి. ఇదే సమ సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుంది. బీసీలు వారికి చెందవలసిన అవకాశాలు వారికి దొరకడానికి ఇలాంటి కృషి చాలా అవసరం. సచార్ కమిటీని 2005 లో యూపీఏ ప్రభుత్వం భారతదేశంలో ముస్లిం సమాజం సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులను అధ్యయనం చేయడానికి ఏర్పాటు చేసింది. 2006లో సమర్పించిన నివేదికలో ముస్లింల పరిస్థితి తీవ్రంగా వెనుకబడినదిగా, కొన్ని సూచికల్లో ఎస్సీ/ఎస్టీల కంటే కూడా దారుణంగా ఉందని వెల్లడించింది. దీంతో లక్ష్యిత అభివృద్ధి మెరుగైన ప్రతినిధిత్వంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉద్భవించింది. ముస్లింల సామాజిక-ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దుర్బలంగా ఉండి, ఆదాయం, విద్య, ఉద్యోగాల్లో వెనుకబడి ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో తక్కువ ప్రాతినిధ్యం ( ఐఏఎస్ లో సుమారు 2.9%, ఐపిఎస్లో 4%). ముస్లిం అధిక జనాభా ఉన్న ప్రాంతాల్లో విద్యా సౌకర్యాల కొరత, ఆరోగ్యం, పారిశు ద్ధ్యం, మౌలిక వసతుల్లో లోపాలు.రెండు సంవత్సరాలు అధ్యయనం చేసిన తర్వాత సిఫార్సులు చేసింది, వివక్షను పరిశీలించడానికి సమాన అవకాశాల కమిషన్ ఏర్పాటు., విద్యావకాశాల విస్తరణ మరియు మదరసా విద్యకు గుర్తింపు. ఉద్యోగాలు, విద్యలో సమానత్వాన్ని ప్రోత్సహించడానికి డైవర్సిటీ ఇండెక్స్ ప్రవేశపెట్టడం. రంగనాథ్ మిశ్రా కమిషన్ కూడా ఇదే తరహా నిర్ధారణలకు వచ్చింది. సచార్ నివేదిక ప్రకారం కొన్ని చర్యలు ప్రారంభమైనప్పటికీ, అమలులో తీవ్రమైన లోపాలు ఉన్నాయని తెలిపింది. సామాజిక-ఆర్థిక సూచికల్లో పూర్తి స్థాయి పురోగతి కనిపించలేదు, కొన్ని రంగాల్లో మరింత దిగజారింది. ముస్లిం యువతలో ఉద్యోగం, విద్య, శిక్షణ లేని వారు శాతం పెరుగుతోంది. దక్షిణ, తూర్పు భారతదేశంలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉండగా, ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో ఇంకా వెనుకబడి ఉంది. పాలసీ చర్యలు ఉన్నప్పటికీ, సరైన అమలు లోపాలతో పాటు పెరుగుతున్న అసమానతలు ముస్లిం సమాజ అభివృద్ధిని ఇంకా అడ్డుకుంటున్నాయి.

# ఘోర బస్సు ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించింది. మార్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల నుంచి ఏపీలోని మార్కాపురం జిల్లా పామూరుకు వస్తున్న హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు బస్సు రాయవరం సమీపంలోని పలకల క్వారీ వద్ద మలుపు తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో బస్సు, టిప్పర్ ఇంజన్‌ను బలంగా ఢీకొట్టింది.

దీంతో బస్సులో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన 10మంది ప్రయాణికులు వెంటనే బస్సు దిగిపోయారు. మరికొందరు దిగే ప్రయత్నం చేస్తుండగానే దట్టమైన పొగ అలుముకోవడంతో బస్సులోనే 14 మంది సజీవదహనమయ్యారు. 15 మందికి గాయాలయ్యాయి. ఘటనాస్థలిని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులను మార్కాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి పరామర్శించారు.రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కలిసి వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

**బస్సు కండీషన్ సరిగాలేకనే..**

బస్సు కండీషన్ సరిగా లేకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని ప్రయాణికులు తెలిపారు. ఇదే విషయాన్ని బస్సు డ్రైవర్‌తో మాట్లాడినట్లు చెబుతున్నారు. ప్రమాదానికి ముందు బస్సును యర్రగొండపాలెం వద్ద గంటసేపు నిలిపి మరమ్మతులు చేపట్టారని అన్నారు. ఇదిలా ఉండగా ప్రమాద సమయంలో బస్సు స్టీరింగ్ స్ట్రక్ అయ్యినట్టు బస్సు డ్రైవర్ చెబుతున్నారు. దీనిపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

**మృతులకు రూ.5 లక్షల పరిహారం**

మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై ఏపీ క్యాబినెట్ భేటీలో చర్చ జరిగింది. మృతులకు ఏపీ మంత్రులు సంతాపం తెలిపి, బాధిత కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున, గాయపడినవారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. అదే విధంగా బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని మంత్రులు, అధికారులకు సూచించారు.

**బస్సు ప్రమాద ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి ఏపీ అధికారులతో మాట్లాడాలని సీఎస్‌కు ఆదేశం**

ఏపీలోని మార్కాపురం బస్సు ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో పలువురు మృతి చెందడం.. కొందరికి తీవ్ర గాయాలవడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బస్సు నిర్మల్ నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న నేపథ్యంలో ఈ ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు.

మృతి చెందిన, గాయపడిన వారి వివరాలు తెలుసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం ఆదేశించారు. ఏపీ అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూడాలని తెలిపారు. సీఎం ఆదేశాలతో ఏపీ సీఎస్‌తో సీఎస్ రామకృష్ణారావు మాట్లాడారు.

# ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ పదిలం

**కుప్పం - సూర్య వాస్తవం:**

పరిశ్రమల రాకతో కుప్పానికి మహర్దశ పట్టబోతోందని, అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించారని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా 3వ రోజు భువనేశ్వరి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా శాంతిపురం మండలం శివ పురంలోని నివాసంలో స్థానిక నేతలతో నారా భువనేశ్వరి బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం శాంతిపురంలో అన్న క్యాంటీన్ ను ప్రారంభించారు. ఆ తర్వాత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐటీడీపీ కార్యకర్త రవి కుటుంబసభ్యులను నారా భువనేశ్వరి పరామర్శించారు. రామకుప్పం, మణేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహాలను ఆవిష్కరించారు. రామకుప్పంలో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామకుప్పం మండలం బల్ల గ్రామంలో మహిళలతో నారా భువనేశ్వరి సమావేశమయ్యారు. అనంతరం రామకుప్పంలో టీడీపీ కార్యకర్త ముజాహిద్ ఇంటికి వెళ్లి కుటుంసభ్యులతో మాట్లాడారు. సంక్షేమ కార్యక్రమాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి రామకుప్పం మండలం గోవిందపల్లి గ్రామానికి వెళ్లిన నారా భువనేశ్వరి ఇటీవల మరణించిన టీడీపీ కార్యకర్త ఆనంద్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు.



పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

**ఎన్టీఆర్ హయాంలో మహిళాభ్యున్నతికి బాటలు**

కుప్పం నియోజకవర్గం రామకుప్పంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. దీంతో కిలోమీటరు మేర వారితో పాటే భువనేశ్వరి కలిసి నడిచారు. విగ్రహావిష్కరణ అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఎన్టీఆర్ తెలుగుదేశం స్థాపించారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారు. పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు రూ. 2 కే కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టిన మహనీయుడు ఎన్టీఆర్. మగవారితో సమానంగా మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించారు. రిజర్వేషన్లు కల్పించారు. ప్రత్యేకంగా మహిళల కోసం పద్మావతి మహిళా యూనివర్సిటీ స్థాపించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్ర బాబు పాలన సాగిస్తున్నారు. డ్వాక్రా స్థాపించి మహిళల ఆర్థిక అభ్యున్నతికి బాటలు వేశారు. పేదలకు పట్టెడన్నం పెట్టాలనే ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు ప్రవేశపెట్టారని నారా భువనేశ్వరి అన్నారు. అనంతరం రామకుప్పం లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి భువనేశ్వరి పూలమాల వేసి నివాళులర్పించారు.

**కుప్పం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక**

రామకుప్పం మండలం బల్ల గ్రామంలో గురువారం పర్యటించిన నారా భువనేశ్వరి మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ ...ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర, స్వర్ణ కుప్పం లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడం చంద్రబాబు సమర్థ నాయకత్వానికి నిదర్శనం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ , అనకాపల్లి జిల్లాలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటవుతున్నాయి. చంద్రబాబుని 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజలకు రుణపడి ఉంటాం. కుప్పానికి పరిశ్రమల రాకతో స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఆర్థిక సాయం చేస్తున్నారు. దీపం పథకం ద్వారా మహిళలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నారు. పేదలకు ఆరోగ్య భరోసా కల్పించేందుకు సంజీవని ప్రాజెక్టు తెచ్చారు. ఇళ్లపై సోలార్ ప్యానెల్స్, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

# డిజిటల్ విద్యతో బాలికలకు బంగారు భవిత

## - డీఈఓ కడప ప్రసాద్ బాబు



అనంతపురం- సూర్య వాస్తవం:
ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిజిటల్ విద్య ఎంతో ప్రాధాన్యం కలిగి ఉందని, డిజిటల్ విద్యతో బాలికలకు బంగారు భవిత సాధ్యమవుతుందని అనంతపురం డీఈఓ కడప ప్రసాద్ బాబు అన్నారు. ఇండి విలేజ్ ఫౌండేషన్, ఇన్ఫోసిస్ బీపీఎం భాగస్వామ్యంతో అనంతపురంలోని విద్యారణ్య నగర్ లో గల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ ను విద్యాశాఖ కార్యాలయ ఏడీ-1 ఎం.మునీర్ ఖాన్‌తో కలసి డీఈఓ ప్రసాద్ బాబు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ భారత దేశంలో డిజిటల్ అంతరాన్ని తగ్గించే దిశగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇండి విలేజ్ ఫౌండేషన్ రూ.8 లక్షలతో ఆరు క్యాప్ ట్యాబులు, నాలుగు డెస్క్ టాప్ లు, ప్రొజెక్టర్, ప్రింటర్, యూపీఎస్ అందించి పూర్తి స్థాయి డిజిటల్ లెర్నింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేయడం అమ్మాయిలకు గొప్ప వరంగా పేర్కొన్నారు. ఇక్కడి ల్యాబ్ ద్వారా మొత్తం 254 మంది విద్యార్థులకు డిజిటల్ విద్యతో పాటు కంప్యూటర్ నైపుణ్యాలు వృద్ధి చేసుకునే అవకాశం కలగడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెడ్మాస్టర్ నరేంద్రకుమార్, ఉపాధ్యాయులు కె.చంద్రశేఖర్రెడ్డి, లక్ష్మీనారాయణ, స్కూల్ డెవలప్మెంట్ కమిటీ చైర్ పర్సన్ గంగా, వైస్ చైర్ పర్సన్ మహాలక్ష్మి, ఇండి విలేజ్ ఫౌండేషన్ ప్రతినిధులు దీపా, రాఘవేంద్ర, అంజుమ్ ఆఫ్రీన్, నిషా, తావీద్, బాబా, సాయినాథ్, ధరణి, అపర్ణ, అనూష సుల్తానా పాల్గొన్నారు.

# నష్టపోయిన అరటి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి

## - టన్ను 15 వేలతో ప్రభుత్వం కొనుగోలు చేయాలి



**పులివెందుల రూరల్ - సూర్య వాస్తవం:** అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని యుద్ధ ప్రభావం, అకాల వర్షాలతో తీవ్ర నష్టంలి టన్ను 15 వేలతో ప్రభుత్వం కొనుగోలు చేయాలి. పులివెందుల ప్రాంతంలో అరటి తోటలను ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రభాకర్ రెడ్డి గురువారం పరిశీలించారు. పులివెందుల ప్రాంతం నల్లపు రెడ్డి గారిపల్లెలో అరటి తోటలను గురువారం ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుద్ధ ప్రభావం వల్ల మార్కెట్‌లో ధరలు పడిపోవడం, అకాల వర్షాల కారణంగా పంటలు నష్ట పోయిన అరటి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదు కోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రపంచ వ్యాప్తంగా జరిగే యుద్ధాలు వాణిజ్య వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయన్నారు దిగుమతులు, ఎగుమతులు మందగించడం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌లో అస్థిరత ఏర్పడుతుందన్నారు జిల్లాలో ప్రధానంగా పులివెందుల ప్రాంతంలో వేల ఎకరాలలో అరటి సాగు చేస్తున్నారన్నారు అయితే యుద్ధ ప్రభావంతో ధరలు పూర్తిగా తగ్గిపోయాయని దానికి తోడు అకాల వర్షాలతో అరటి చెట్లు కూలిపోవడం, గెలలు విరిగిపోవడం తో అరటిపంట పూర్తిగా దెబ్బతినిందన్నారు. కంటికి రెప్పలా చూసుకుని తీరా పంట చేతికొచ్చే సమయంలో ధరల లేకపోవడం, పంట నష్టం జరగడంతో అరటి రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని అరటి రైతులకు తక్షణ పరిహారం అందించడం అత్యవసరమన్నారు. పంట నష్టాన్ని లెక్కించి ప్రభుత్వం తక్షణం అరటి రైతులను ఆదుకోవాలని, అరటి పంటను టన్ను 15 వేలతో ప్రభుత్వం కొనుగోలు చేసి అరటి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పర్యటన కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జి చంద్రశేఖర్ రామ్మోహన్ మనోహర్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ ప్రజా సంఘాల నాయకులు చాంద్ భాషా జకరయ్య రవి సుమంత్ శివకుమార్ గఫూర్ మహిళా సంఘం నాయకురాలు రాజమణి ఐఎన్ సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

## - పాలచూరులో "రైతన్న మీకోసం" కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ

## - రైతులకు పథకాలపై అవగాహన



**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పాలచ్చురు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతన్న మీకోసం" కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డా. నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా హాజరై రైతులతో ప్రత్యక్షంగా సమావేశమయ్యారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం మరియు వ్యవసాయ రంగ అభివృద్ధి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. ముఖ్యంగా "అన్నదాత సుఖీభవ" పథకం ద్వారా ఇప్పటికే రైతుల ఖాతాల్లోకి నగదు జమ చేసినట్లు తెలిపారు. రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడే లా ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందన్నారు. వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే వెల్లడించారు. రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నామని చెప్పారు.ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు మరియు వ్యవసాయ సాంకేతిక సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మట్టి పరీక్షలు చేయించుకోవడం, నాణ్యమైన విత్తనాలు ఉపయోగించడం, పంటల సాగులో శాస్త్రీయ విధానాలు పాటించడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చని చెప్పారు. రైతులకు అవసరమైన మార్గదర్శకాన్ని వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంచి కృష్ణయ్య యాదవ్, కందమూడి శివకుమార్, వేలూరు మురళీకృష్ణారెడ్డి, అనిల్ రెడ్డి, మాధవరెడ్డి, పెంచలయ్య, కోటా రమేష్ యాదవ్, చంద్ర తదితర నాయకులు, అధికారులు మరియు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా ప్రభుత్వం రైతులకు మరింత చేరువ అవుతోందని స్థానికులు అభిప్రాయపడ్డారు.



# హాస్టళ్లలో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

## - విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబు

నాయుడుపేట - సూర్య వాస్తవం : నాయుడుపేట పట్టణంలోని లోతువానిగుంట ప్రాంతంలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహాల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబు తెలిపారు. గురువారం ఆయన నాయుడుపేట పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాలను ప్రత్యక్షంగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్లో నివసిస్తున్న విద్యార్థినులతో మాట్లాడిన ఆయన, వారి చదువులు, ఆరోగ్యం, భోజన ఏర్పాట్లు మరియు ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం మెనూ ప్రకారం నాణ్యంగా ఉండేలా చూడాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. విద్యార్థినుల ఆరోగ్యం మరియు భద్రతపై ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించిన డాక్టర్ శ్రీపతి బాబు, మరుగుదొడ్లలో టైల్స్ ఊడిపోవడం, పరిశుభ్రత లోపించడం వంటి సమస్యలను గమనించారు. అదేవిధంగా హాస్టల్ చుట్టూ ఉన్న ప్రహరీ గోడ ఎత్తు తక్కువగా ఉండడం వల్ల భద్రత పరంగా ఇబ్బందులు ఏర్పడే అవకాశముందని తెలిపారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. హాస్టల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా సమగ్రమైన నివేదిక తయారు చేసి సమర్పించాలని హాస్టల్ సంక్షేమ అధికారులకు ఆదేశించారు. విద్యార్థినులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, హాస్టల్ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు సురక్షిత మంచినీరు అందించడమే లక్ష్యం

## - సమగ్రశిక్ష ఏపీసీ శైలజ



అనంతపురం - సూర్య వాస్తవం: పాఠశాలల విద్యార్థులకు సురక్షిత మంచినీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేసిన శుద్ధి జల ప్లాంట్లు విజయవంతంగా పని చేసేలా చూడాలని సమగ్ర శిక్ష ఏపీసీ టి.శైలజ అన్నారు. అనంతపురంలోని జేఎన్టీయూ రోడ్డులో గల సైన్స్ సెంటర్లో గురువారం ఏర్పాటు చేసిన ఒరియంటేషన్ శిక్షణ సందర్భంగా పాఠశాలల్లో ఆర్.ఓ ప్లాంట్ల నిర్వహణపై పాఠశాలల హెడ్మాస్టర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్ల పరిస్థితి గురించి ఆరా తీశారు. తాజా పరిస్థితిపై ప్రతి పాఠశాల హెడ్మాస్టర్ నివేదిక రూపంలో అందించాలని సూచించారు. విద్యుత్ సమస్యలు, నీటి సరఫరా వంటి సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇంకా అనేక అంశాలపై చర్చించారు. ఆర్ ప్లాంట్లు లేని పాఠశాలల్లో కొత్తగా ప్లాంట్లు ఏ విధంగా ఏర్పాటు చేయాలో ఆ సంస్థ ప్రతినిధులు వివరించారు. ఇంజినీర్ రమణారెడ్డి, అసిస్టెంట్ ఏఎంఓ నారాయణస్వామి, ఏపీఓ నారాయణస్వామి మాట్లాడారు.

# వ్యాపారులు అక్రమంగా గ్యాస్ సిలిండర్లు వాడితే కఠిన చర్యలు



**వేంపల్లె - సూర్య వాస్తవం :** గృహ వినియోగం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే డొమెస్టిక్ వంట గ్యాస్ సిలిండర్లను వాణిజ్య ప్రయోజనాల కోసం హటరీటళ్లలో, టీ స్టాళ్లలో అక్రమంగా ఉపయోగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ వదలబోమని పులివెందుల ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తహసీల్దార్ సుధీర్, డిఈ ఈశ్వరయ్య లు హెచ్చరించారు. గురు వారం వారు రెవెన్యూ సిబ్బందితో కలిసి బస్ స్టాండ్ పరిసరాలు, నాలుగు రోడ్ల కూడలి, పట్టణంలోని పలు హటరీటళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ దాడుల సందర్భంగా అనేక హటరీటళ్లలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల స్థానంలో డొమెస్టిక్ సిలిండర్లను ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. చట్టవిరుద్ధంగా వినియోగిస్తు న్నందుకు మొత్తం 5 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సుధీర్ మాట్లాడుతూ హటరీటళ్లలో వాణిజ్యంగా చేసే వంటకాలకు తప్పనిసరిగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను మాత్రమే ఉపయో గించాలని సూచించారు. డొమెస్టిక్ సిలిండర్లు గృహ అవసరాల కోసం ప్రభుత్వం సబ్సిడీతో అందించే సదుపాయం. ఈ సదుపాయాన్ని దుర్వినియోగం చేయడం చట్టవిరుద్ధం. అటువంటి హటరీటళ్లపై కఠిన చర్యలు మాత్రమే కాదు, నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని హెచ్చరించారు. వ్యాపారులు నిబంధనలు పాటించి కమర్షియల్ సిలిండర్లను మాత్రమే వాడాలని సూచించారు. ఈ దాడులలో వీఆర్వోలు యుగంధర్, బషీర్ బాబా, ఓబయ్య మరియు అధికారులు పాల్గొన్నారు.

# మహిళలు ఎదుర్కొంటున్న గ్యాస్ సమస్యను వెంటనే పరిష్కరించాలి




**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య అనంతపురం జిల్లా గుత్తి మండలం లోని మహిళా సమాఖ్య నియోజక వర్గ కార్యదర్శి మమద.ఆధ్వర్యంలో మహిళల కార్యకర్తల నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ ప్రస్తుతం గృహిణులు తీ వ్రమైన ఎల్పీజీ గ్యాస్ సమస్యలను ఎదుర్కొంటున్నారు.గ్యాస్ సిలిండర్ ధరలు పెరగడం, సరఫరాలో ఆల స్యం,బుకింగ్ చేసిన తర్వాత కూడా సమయానికి అందకపోవడం వంటి సమస్యలు మహిళల దైనందిన జీ వితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తు న్నాయి.ఈ పరిస్థితుల్లో పేద మరి యు మధ్య తరగతి కుటుంబాలు మరింత ఇబ్బందులు పడుతున్నాయి.ఇంటి పనులన్నీ నిర్వహించే మ హిళలకు గ్యాస్ ఒక అత్యవసర అ వసరం.కొన్ని ప్రాంతాల్లో గ్యా స్ ఏజెన్సీల నిర్లక్ష్యం వల్ల సకాలంలో సిలిండర్లు అందకపోవడం వల్ల మ హిళలు మళ్లీ కట్టెల పొయ్యిలపై వం ట చేయాల్సి వస్తోంది.ఇది ఆరోగ్యా నికి హానికరం.ప్రభుత్వం వెంటనే గ్యాస్ ధరలు చూస్తే ఎన్టీఆర్ ప్రభు త్వంలో 400కున్న సిలిండర్ వెయ్యి రూపాయలు వరకు పెంచి పేద ప్రజ లకు గ్యాస్ ధర 60,రూపాయలు పెంచి కమర్షియల్ గ్యాస్ 140 రూ పాయలు పెంచి పేదవారికి మునిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ధరలు పెరిగాయి కావున ధరలను తగ్గించి, సరఫరాను సక్రమంగా నిర్వహిం చేలా చర్యలు తీసుకోవాలిమహిళల సమస్యలను పట్టించుకో కుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదు.ఈ సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే మహిళా సమా ఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందో ళనలు చేపడతామని హెచ్చరించా రు,ఈ కార్యక్రమంలో మహిళా కార్యకర్తలు సంధ్య, హసీనా బేగం, రాణి, హాజ్రా, మీనాక్షి, నాగలక్ష్మి, వనిత, లావణ్య, దేవి, ప్రమీల, చిలకమ్మ, ముంతాజ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలలను వెంటనే ప్రారంభించాలి

## - పీపీపీ వద్దు.. ప్రభుత్వమే ముద్దు



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందులతో సహా రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న పది ప్రభుత్వ వైద్య కళాశాలలను త్వరలో పూర్తిచేసి ఈ విద్యా సంవత్సరం నుండే ప్రభుత్వ రంగంలో ప్రారంభించాలని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం గుంటూరు పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య,కాంగ్రెస్ మీడియా కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ కుమార్ రెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే. ప్రభాకర్ రెడ్డి,సామాజిక ఉద్యమ నేత ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షులు కే. నారాయణ,బిసి చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బీసీ రమణ వివిధ విద్యార్థి యువజన, పౌరసంస్థల నేతలు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ అలా వెంకటేశ్వర్లు,జనచైతన్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి,సామాజికవేత్త డాక్టర్ వసుంధర కుర్ర నేతృత్వంలో వందలాదిమంది పులివెందుల మెడికల్ కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ప్రసంగిస్తూ పీపీపీ విధానంలో వైద్య కళాశాలను నిర్మిస్తే రిజర్వేషన్లు అమలు కావని,పేద విద్యార్థులు, ప్రతిభావంతులైన విద్యార్థులు నష్టపోతారని,పేద రోగులకు వైద్యం ఉచితంగా లభించదని వివరిస్తూ ప్రభుత్వం వైద్య రంగంలో పిపిపి విధానానికి స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రైవేటుపరం చేసే టట్లు ఉందని ఈశ్వరయ్య ఎద్దావ చేశారు.కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి మాట్లాడుతూ పులివెందల మీద, కడప జిల్లా మీద చంద్రబాబు కక్ష కట్టడం శోచనీయమని ఆవేదన వెల్లబుచ్చారు.దాదాపు 150 కోట్ల రూపాయల విలువచేసే 50 ఎకరాల భూమిని, 412 కోట్ల రూపాయలతో నిర్మించిన భవనాలను ప్రైవేటు వాళ్లకు అప్పజెప్పాలనే ధోరణిని విడనాడాలని కోరారు.2024 --25 సంవత్సరంలోనే నేషనల్ మెడికల్ కమిషన్ కేటాయించిన 50 ఎంబిబిఎస్ సీట్లను చంద్రబాబు ప్రభుత్వం వద్దనటం సహేతుకం కాదన్నారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ కుమార్ రెడ్డి ప్రసంగిస్తూ వైకాపా ప్రభుత్వం ఒకేసారి 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుమతులు తెచ్చి అందులో ఏడు కళాశాలను ప్రారంభించారని,మిగిలిన 10 నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం గత 21 నెలలుగా ఏమాత్రం పట్టించుకోకపోవడం దురదృష్టకరం అన్నారు.రాష్ట్రంలో వివిధ పార్టీలు ప్రజాసంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు పౌర సంస్థలు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు.ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ అలా వెంకటేశ్వర్లు ప్రసంగిస్తూ ప్రైవేటు వైద్య కళాశాలలో అధిక ఫీజులు కట్టలేక వందలాది సీట్లు ఖాళీగా ఉన్నాయని కనుకనే టెండర్లలో ఎవరు పాల్గొనటం లేదనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గ్రహించాలన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ నేటి ముఖ్యమంత్రి వివిధ ఈవెంట్ల పేర్లతో వేలాది కోట్ల రూపాయలను మంచినీళ్ల ప్రాయంగా దుబార చేస్తున్నారని అందులో ఏ కొంచెం ఖర్చుపెట్టినా నిర్మాణంలో ఉన్న పది ప్రభుత్వ మెడికల్ కళాశాలలు పూర్తి అవుతాయని లక్షలాదిమంది పేద రోగులకు ఉచిత వైద్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.



# హోటళ్లపై ఎమ్మార్వో ఆకస్మిక తనిఖీలు నిల్వ ఉంచిన 17 గ్యాస్ సిలిండర్లు పట్టివేత



**ఉరవకొండ - సూర్య వాస్తవం:** జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు ఉరవకొండలోని హోటళ్లలో ఎమ్మార్వో పాటిల్ భోగన గౌడ్ అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వాణిజ్య అవసరాలకు వినియోగించాల్సిన కమర్షియల్ గ్యాస్ కు బదులుగా డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్నట్లు గుర్తించి, మొత్తం 17 సిలిండర్లను సీజ్ చేశారు. ఈ విషయంపై నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. కమర్షియల్ అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ వినియోగిస్తే పౌర సరఫరాల చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోండి

## - సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం:** కోవరంగుట్టపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ రోటరీ ను గురువారం నాడు పులివెందుల మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య సందర్శించి ల్యాబ్ టెక్నీషియన్ శ్రావణిని ఈ వారంలో మలే రియా డెంగ్యూ సంబంధించిన వ్యాధులు ఏమైనా నిర్ధారణ అయ్యాయా అని వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్య క్రమంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలి. దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఈ వ్యాధులను అరికట్టవచ్చు,?ప్రజలు తీసుకోవాల్సిన

**జాగ్రత్తలు: నీటి నిల్వలు లేకుండా చూడాలి:** ఇళ్ల వద్ద పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండలు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నిల్వ నీటిలోనే దోమలు గుడ్లు పెడతాయి.

**వ్యక్తిగత రక్షణ:** రాత్రి వేళల్లో నిద్రించేటప్పుడు తప్పనిసరిగా దోమతెరలు వాడాలి. సాధ్యమైనంత వరకు ఒళ్లు పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలి.

**ఫ్రైడే డ్రై డే:** ప్రతి శుక్రవారం 'డ్రైడే' గా పాటించి, ఇంట్లోని నీటి తొట్లు, డ్రమ్ములు శుభ్రం చేసుకోవాలి.

**లక్షణాలు కనిపిస్తే:** తీవ్రమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, కళ్ళ వెనుక నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి రక్త పరీక్ష చేయించుకోవాలి అని సిద్దయ్య తెలిపారు.

# కారు డ్రైవర్ల ఘర్షణ

## - పోలీసుస్టేషన్‌కు తరలింపు



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఉరవకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద జల్లిపల్లి గ్రామానికి చెందిన కార్ల డ్రైవర్లు, స్థానిక డ్రైవర్ల మధ్య ప్యాసింజర్లను ఎక్కించుకోవడం, దింపడం విషయంలో వివాదం తలెత్తింది. ఈ వివాదం ఘర్ష ణకు దారితీయడంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పోలీసులు వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తీసుకుని, డ్రైవర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సంఘటనతో బస్టాండ్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చుట్టు ప్రక్కల ప్రజలు భయాఆందోళనకు గురయ్యారు.

# కోలాహలంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు



**పులివెందుల - సూర్య వాస్తవం :** అభిమానులు, కార్యకర్తల కోలాహలం మధ్య ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి సతీమణి భూమిరెడ్డి ఉమాదేవి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం వారి నివాసంలో పెద్ద ఎత్తున జరిగింది. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలివచ్చి ఆయనకు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ప్రత్యేక కేకును, ఎమ్మెల్సీ సతీమణి ఉమాదేవి కార్యకర్తలతో కలిసి కట్ చేశారు. రామగోపాల్ రెడ్డి నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లి, మరిన్ని ఉన్నత పదవులు అధి రోహించాలని ఆకాం క్షించారు. ఈ సందర్భంగా భూమి రెడ్డి ఉమాదేవి మాట్లా డుతూ.. "కార్యకర్తల ప్రేమాభిమానాలే భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి కి కొండంత అండ. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం, పార్టీ బలోపేతం కోసం ఎల్లవేళలా కృషి చేస్తాం" అని పేర్కొన్నారు.

**సేవా కార్యక్రమాల వెల్లువ :** జన్మదినం సందర్భంగా నియోజకవర్గవ్యాప్తంగా పలుచోట్ల తెలుగుదేశం పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పేదలకు అన్నదానకార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముగిసిన సెరికల్చర్ సర్టిఫికెట్ కోర్సు



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం హెచ్ ఓ డి మరియు కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ యు.శ్రీనిత ఆధ్వర్యంలో పట్టుపురుగుల పెంపకం, ఉపాధి అనే సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించి అనేక అంశాలు విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాసులు అధ్యక్షత వహించి విద్యార్థినిలు పట్టుపురుగులను పెంచి పట్టుగూళ్ళను సేకరించి ముడి పట్టును ఉత్పత్తి చేసి వ్యవసాయ ఆధారిత ఉపాధిని పొందవచ్చని అనేకులకు ఉపాధిని కల్పించవచ్చని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ యు.శ్రీనిత మాట్లాడుతూ పట్టుపురుగుల పెంపకం గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు రైతులకు ఏడాది పొడవునా ఆదాయం మరియు ఉపాధి కల్పిస్తుందని,సెరికల్చర్ యూనిట్ ప్రారంభించడం అద్భుత అవకాశం వారే యూనిట్ ఓనర్ పదిమందికి ఉపాధి ఇచ్చే బాస్ అవ్వొచ్చు. పట్టుపురుగులు సాగు చేస్తూ నెలకు 4 లక్షల ఆదాయం సాధించే రైతులు కూడా కలరు. పట్టుపురుగుల సాగుకు గవర్నమెంట్ సబ్సిడీ కూడా కల్పిస్తుంది. సమతల శీతోష్ణ ఉష్ణోగ్రత ఎర్ర రేగడి నేలలు పట్టు పరిశ్రమకు అనుకూలం, బై వోల్టేన్ వలన చాలా ఆదాయం లభిస్తుంది. విదేశీ మారకద్రవ్యం కూడా పొందవచ్చు, ఏడాది పొడవునా ఉపాధి పొందవచ్చు అని తెలియజేశారు. అనంతరం విద్యార్థినిలకు సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో కె.జనార్ధన డి. ప్రవళిక మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

# ఘనంగా నేడు సీతారాముల కల్యాణం శ్రీరామనవమికి ఏర్పాట్లు సర్వం సిద్ధం



**పులివెందుల - సూర్య వాస్తవం:** సీతారాముల కల్యాణోత్సవం శ్రీరామనవమి (చైత్ర శుద్ధ నవమి) రోజున అత్యంత వైభవంగా జరుగుతుంది. వాటిలో భాగంగా పులి వెందు లలో నకరికట్టనందు అతి పురాతనమైన ప్రసిద్ధిగాంచిన శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీరామనవమి పండు గను పురస్కరించుకొని సీతారాముల కళ్యాణ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని ఆలయ ధర్మకర్త రామచంద్రారెడ్డి నిర్వాహకులు మాచిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చెన్నారెడ్డి ప్రతాప్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోదండ రామాలయాలలో మూల విరాట్ కు అభిషేకాలు ప్రత్యేక అలంకారాలు, సాయంకాల సమయాన గ్రామోత్సవం, ఉదయం 9 గంటల నుండి స్వామివారి కళ్యాణం ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలతో అలంకరించి స్వామివారి కళ్యాణం తలంబ్రాలతో ఈ వేడుక కనులారా "సీతారాముల కల్యాణము తిలకించి స్వామివారి ఆశీస్సులు పొంది అన్నప్రసాద తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ నిర్వహకులు పిలుపునిచ్చారు.

# ప్రమాదంపై డాక్టర్ కోలా ప్రసాద్ దిగ్భ్రాంతి

### - బస్సు ప్రమాదంలో 8 మంది సజీవదహనం కావడం బాధాకరం
### - మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి
### - ఒక్కొక్కరికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

**పులివెందుల అర్బన్ - సూర్య వాస్తవం :** మార్కాపురం జిల్లాలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ ప్రమా దంలో 8 మంది మృతి చెందడం జరిగింది. మృతి చెందినచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్గ్రేసియా ఒక్కొక్కరికి 20 లక్షలు ఇవ్వాలని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల నుంచి వింజమూరు వెలుతున్న ప్రవేట్ ట్రావెల్ బస్సు రాయవరం సమీపంలోని క్వారీల వద్ద టిప్పర్‌ను ఢీకొట్టడం జరిగిందన్నారు. ఢీకొట్టిన వెంటనే మంటలు చెలరేగి బస్సు, టిప్పర్ క్షణాల్లోనే పూర్తిగా దగ్ధమయ్యాయి అన్నారు. 8 మంది సజీవదహనం కావడం చాలా బాధాకరమన్నారు. 18 మందికి గాయాలన్నట్లు గాయా లైన వారికి పది లక్షల చొప్పున ప్రభుత్వం ఎక్స్గ్రేసియా ఇవ్వాలన్నారు.ఆ బస్సులో దాదాపు 40 మంది ఉన్నట్లు స్థానికులు తెలపడం జరిగిందన్నారు. ప్రైవేటు బస్సులు ఇప్పటికే చాలా అగ్నికి ఆహుతి కావడం జరిగిందన్నారు. మరణించిన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని అన్నారు.



# ఇచ్చిన మాటకు కట్టుబడే ముఖ్యమంత్రి చంద్రబాబు

- టీడీపీ ప్రభుత్వం ఉగాది కానుకగా ఉద్యోగాల పండగ
- వై.నాగేశ్వరరావు యాదవ్ డిసిఎంఎస్ ఛైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు



**కర్నూల్ – సూర్య వాస్తవం :** కర్నూల్ నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం జిల్లా అధ్యక్షు రాలు గుడిసె కృష్ణమ్మ ఆధ్వర్యంలో ఉగాది కానుకగా టీడీపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండరు విడుదలపై ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం టీడీపీ జిల్లా నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడిసె కృష్ణమ్మ, వై.నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ యువ గళం హామీని నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం టీడీపీ ప్రభుత్వం. ఉగాది కానుకగా జాబ్ క్యాలెండర్ 2026 విడుదల చేసింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో మొత్తం 10,060 పోస్టుల భర్తీకి జాబ్ క్యాలెండర్ విడుదలైంది. ఈ మేరకు ఉగాది కానుకగా ఉద్యోగాల పై మంత్రి లోకేశ్ బాబు గారు ప్రకటించారు. తాజా జాబ్ క్యాలెండర్‌లో వివిధ శాఖల్లో భర్తీ చేయనున్న పోస్టుల వివరాలను ప్రకటించడం జరిగింది. ఇకపై ఏటా ఉగాదికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని లోకేష్ బాబు హామీ ఇవ్వడం జరిగింది . అలాగే ఏ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఏ తేదీన వస్తాయో, ఎన్ని పోస్టులు భర్తీ చేస్తారో కూడా జాబ్ క్యాలెండర్‌లో వివరాలు విడుదల చేయడం జరిగింది.

తేదీల వారీగా ఉద్యోగ నోటిఫికేషన్లు, పోస్టుల వివరాలు..

**ఉన్నత విద్యలో 1500 పోస్టులకు మే 15, 2026న నోటిఫికేషన్**

2.ఏపీపీఎస్సీ గ్రూప్ 1లో 91 పోస్టులు, 3.హోంశాఖలో 2,778 పోస్టులు, ఇతర శాఖల్లో 928 పోస్టులకు మే 15, 2026న నోటిఫికేషన్

ఏపీపీఎస్సీ గ్రూప్ 2లో 250 పోస్టులు, ఇంజనీరింగ్‌లో 503, ఇతర శాఖలు 506 పోస్టులకు సెప్టెంబర్ 15, 2026న నోటిఫికేషన్

పాఠశాల/ఇంటర్ విద్యలో 3004 పోస్టులకు అక్టోబర్ 15, 2026న నోటిఫికేషన్లు విడుదల చేయడం జరిగిందని తెలిపారు.పారదర్శకంగా, వేగవంతంగా నియామక ప్రక్రియ చేపట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. కేవలం 20 నెలల్లోనే 6,28,347 ఉద్యోగాలను యువతకు అందించడం జరిగింది. యువత భవిష్యత్ ను నాశనం చేసిన జగన్. ఎన్నికలకు ముందు 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ అన్న జగన్ రెడ్డి. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేశాడు.వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తగా రాష్ట్రానికి పరిశ్రమలు పెట్టుబడులు తీసుకురాకపోగా కమీషన్ల కోసం ఉన్న కంపెనీలను తరిమేసి 34 లక్షల మంది యువత భవిష్యత్‌ను నాశనం చేసింది.

జగన్ పాలనలో యువత ఉద్యోగాలు, ఉపాధి లేక వేలాదిమంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఈ సందర్భంగా తెలియ జేస్తూ టిడిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలించడం జరుగుతుందని సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి మంత్రి నారా లోకేష్ బాబుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

# నాయకులు కార్యకర్తలతో మమేకమైన ఎంపీ అవినాష్ రెడ్డి





**పులివెందుల – సూర్య వాస్తవం:** భవిష్యత్తులో జరగబోయే ఏ ఎన్నికలకైనా నాయకులు మరియు కార్యకర్తలు ప్రణాళికాబద్ధంగా సమిష్టి కృషి చేద్దామని జిల్లా ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు.

గురువారం పులివెందులలోని జగన్ క్యాంపు కార్యాలయం నందు తనను కలిసిన నాయకులు, కార్యకర్తలతో చిరునవ్వులు చిందిస్తూ ప్రతి ఒక్కరిని పేరుపేరునా పలకరిస్తూ పార్టీ విజయాలే లక్ష్యంగా అడుగులు వేయాలని అదే విధంగా క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఇప్పటికే కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందించడంలో విఫలమయ్యారని వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని గత ప్రభుత్వంతో పోలికలు చేస్తున్నారని కావున పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంగా పార్టీ పటిష్టతకు పని చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారుడికి ఘన సన్మానం

**- డీఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న ఆటోడ్రైవర్ కోచ్చెర్వు నారాయణస్వామి**



**డోన్ – సూర్య వాస్తవం:** ఉమ్మడి కర్నూలు జిల్లా డోన్ మండలం కోచ్చెర్వు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నారాయణ స్వామి స్ఫూర్తి సేవా సమితి సంస్థలో ముఖ్య సభ్యుడిగా సేవలు చేస్తున్నారు. అతనికి క్రీడలు అంటే చాలా ఇష్టం. ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ దాతలు అందిస్తున్న సహకారంతో గత కొన్ని ఏళ్లుగా క్రీడా పోటీల్లో పాల్గొంటూ ఆడిన ప్రతి చోటా విజయం సాధించి పతకాలు , ప్రశంస పత్రాలు సాధించి సొంత ఊరికి డోన్ మండలానికి పేరు తెచ్చాడు. అందులో భాగంగా ఫిబ్రవరి లో అజ్మీర్ లో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని పోల్ వాల్ట్, లాంగ్ జంప్ విభాగల్లో రెండు కాంస్య పతకాలు సాధించారు. అజ్మీర్ కి వెళ్ళడానికి ఆర్థిక సాయం అందించిన డోన్ డీఎస్పి శ్రీనివాస్ కి నారాయణ స్వామి స్ఫూర్తి బృందంతో కలిసి కృతజ్ఞతలు ధన్యవాదములు తెలుపగా, క్రీడల్లో ఎంతో ఉత్సాహంతో పాల్గొంటూ విజయం సాధిస్తున్న నారాయణ స్వామి ఎంతోమందికి స్ఫూర్తిదాయకం అని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. అనంతరం నారాయణ స్వామిని డోన్ డీఎస్పీ శ్రీనివాస్ , డోన్ టౌన్ సీఐ ఇంతియాజ్ బాష , డోన్ రూరల్ సీఐ రాకేష్, ప్యాపిలి సీఐ వెంకటరామిరెడ్డి, బనగానపల్లె సీఐ ప్రవీణ్ కుమార్ శాలువాతో ఘనంగా సన్మానించి, నారాయణ స్వామిని ప్రోత్సహిస్తున్న స్ఫూర్తి సంస్థ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి సభ్యులు స్ఫూర్తి మధు, భాస్కర్, మోహన్ రెడ్డి, చిట్యాల మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇడుపులపాయ మారుతీనగర్‌లో తాగునీటి కష్టాలు

**వేంపల్లె – సూర్య వాస్తవం :** వేంపల్లె మండలంలోని ఇడుపులపాయ పంచాయతీ పరిధిలోని మారుతీ నగర్ ఎస్సీ కాలనీలో పైప్‌లైన్ పగిలిపోయి 4రోజులు అయిన అధికారులు స్పందించకపోవడంతో కాలనీ వాసులు తీవ్రమైన తాగు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను స్థానిక వైసీపీ నాయకుడు పోతిరెడ్డి మహేష్, వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనల మేరకు 4 రోజుల నుండి పోతిరెడ్డి మహేష్ తన స్వంత వ్యయంతో నీటి ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేయడం జరుగుతుంది. అత్యవసర సమయంలో సహాయం అందించిన జడ్పిటిసి రవికుమార్ రెడ్డి అన్నకు, వైసీపీ నేత పోతిరెడ్డి మహేష్‌కు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సంబంధిత అధికారులు ఇప్పటికైనా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## ఘనంగా ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు

**డాక్టర్ డి వి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం**



**వేంపల్లె – సూర్య వాస్తవం :** రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాం గోపాల్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు వేంపల్లెలో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు డాక్టర్ డి వి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ నగర్ లో ఉన్న అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో వృద్దులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. రాంగోపాల్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతొ సంతోషం గా ఉండాలని ఆయన అభిమానులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ డివి సుబ్బారెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి విద్యావంతుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తన వంతు కృషి చేస్తున్నారని కొనియాడారు. సమాజ సేవ పట్ల ఆయన చూపుతున్న అంకితభావం ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. వేంపల్లి మాజీ మండలాధ్యక్షుడు మల్లంగి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల మధ్య సాన్నిహిత్యంగా మెలిగి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడంలో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ముందుంటారని తెలిపారు. భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని అభిమానులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఏమిరెడ్డి కృష్ణారెడ్డి, పోతిరెడ్డి శివ, ఇడుపులపాయ చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 1న సర్వసభ్య సమావేశం మండల అభివృద్ధి అధికారి కుళాయమ్మ



**వేంపల్లె – సూర్య వాస్తవం :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏప్రిల్ 1 వ తేదీ బుధవారం రోజున ఉదయం 10 :30 నిమిషములకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి కుళాయమ్మ తెలిపారు. ఈ సమావేశంలో పౌరసరఫర, వైద్యం, తాగునీరు, వ్యవసాయం, పారిశుధ్యం, విద్యుత్, ఉపాధి హామీ, గృహ నిర్మాణం తదితర శాఖలకు సంబంధించి సమీక్ష సమావేశం ఉంటుందని తెలిపారు. కావున సదరు సమావేశానికి మండల స్థాయి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావలసిందిగా తెలిపారు.

## టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డికి పరామర్శ




**వేంపల్లె – సూర్య వాస్తవం :** వృషభాచలేశ్వర దేవస్థాన కమిటీ మాజీ ఛైర్మన్ సింగారెడ్డి జయచంద్రారెడ్డిని పలువురు టీడీపీ నాయకులు, అభిమానులు పరామర్శించారు. గత కొన్ని రోజులుగా ఆయన కాలు నొప్పితో కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది తన స్వగ్రామమైన వేంపల్లెకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు ఆయన ఇంటికి చేరుకుని జయచంద్రారెడ్డిని పరామర్శించారు. వైద్యుల సలహాలు, సూచనలు పాటిస్తూ తొందరగా కోలుకోవాలని పలువురు ఆకాంక్షించారు.

## ముందస్తు శ్రీరామనమ్మి వేడుకలు



**వేంపల్లె – సూర్య వాస్తవం :** స్థానిక శ్రీ చైతన్య హై స్కూల్‌లో ముందస్తు శ్రీరామనవమి వేడుకలను భక్తి, శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆధ్యాత్మిక వాతావరణంలో ఈ వేడుక లను నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం అందంగా అలంకరించబడగా, విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ కార్యక్రమం ప్రత్యేక పూజలతో, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది. అనంతరం విద్యార్థులు భక్తి గీతాలు ఆలపించి, శ్రీ రామనవమి ప్రాముఖ్యతను ప్రతిబింబించే సాంస్కృతిక కార్య క్రమాలను ప్రదర్శించారు. శ్రీరాముడు, సీత, లవకుశ వేషధారణలో వచ్చిన చిన్నారులు అందరినీ ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బి. చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ,శ్రీరాముడు ధర్మానికి ప్రతీక ఆయన చూపిన మార్గంలో నడుస్తూ సత్యం, నీతి, విధేయతలను జీవితంలో ఆచరించాలి అని విద్యార్థులకు సందేశమిచ్చారు,అలాగేపాఠశాల డైరెక్టర్లు బి. చేతన్ రెడ్డి మరియు చైతన్య రెడ్డి కుడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు శ్రీ రామ నవమి పర్వదినం ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యతను వివరించి, సత్యం, నియమం, భక్తి వంటి విలువలను జీవితంలో ఆచరించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ప్రాంగణమంతా భక్తి, శ్రద్ధలతో కళకళలాడుతూ రామస్మరణతో దివ్యమైన ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## జిల్లా ప్రజలకు శ్రీరామ నవమి పర్వదిన శుభాకాంక్షలు

### - శ్రీరామ నవమి' పండుగ ప్రతి ఇంట సంతోషకరంగా సాగాలని ఎస్పీ ఆకాంక్ష



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ప్రజలకు ఎస్పీ పి.జగదీష్ శ్రీరామ నవమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీరాముడు ఆచరించిన జీవన విధానం పరిపూర్ణ మానవ జీవితానికి నిలువెత్తు నిదర్శనమని... కరుణ, దయ, నీతి, చిత్తశుద్ధి, ప్రేమ, ధర్మం, సత్యం ఆచరించి మార్గదర్శకంగా నిలిచిన ఆ మహనీయుని జన్మదినం, కళ్యాణం, పట్టాభిషేకం జరిగిన రోజైన చైత్ర శుద్ధ నవమి దినాన జరుపుకునే శ్రీరామ నవమి పండుగ ప్రతి ఇంటా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలు, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలను కోరారు. జిల్లాలోని అన్ని ప్రధాన రామాలయాలు, ఆంజనేయస్వామి వారి దేవాలయాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు ఆయా పోలీసులు చేపట్టారన్నారు. శోభాయాత్ర, కళ్యాణ వేడుకలు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఆయా పోలీసులకు సహకరించాలన్నారు.

## పట్టణంలో విస్తృత ఫుట్ పెట్రోలింగ్



**వేంపల్లె - సూర్య వాస్తవం:** వేంపల్లె సీఐ నరసింహులు పర్యవేక్షణలో గురువారం పటంలో విస్తృత ఫుట్ పెట్రోలింగ్ నిర్వ హించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఫోర్ రోడ్ జంక్షన్ వరకు పోలీసులు పాదయాత్ర ద్వారా గస్తీ నిర్వహించారు. ఫుడ్ పెట్రోలింగ్ సందర్భంగా కడప రోడ్డులో, గాంధీ రోడ్డులో అనధికారికంగా ఏర్పాటు చేసిన వ్యాపారాలు ఇతర అక్రమాలను పోలీసులు తొలగించారు. సిఐ నరసింహులు మాట్లాడుతూ పట్టణంలో నాలుగు రోడ్ల భద్రత, ట్రాఫిక్ సౌకర్యం,పాదాచారుల అసౌకర్యం కోసం ఈ చర్యలు చేపట్టామని తెలుపుతూ, ప్రజలు రోడ్ల అక్రమాలు నివారించాలి. ట్రాఫిక్ నియమాలు పాటించాలని తెలిపారు. పట్టణంలో భద్రత చర్యలు కట్టుదిడ్డంగా కొనసాగిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## విత్తనశుద్ధి పైలటైజేషన్ ద్వారా మొలక శాతం పెరుగుదల

### -జేడేఏ శివ నారాయణ



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:**

విత్తన శుద్ధి పైలటైజేషన్ ద్వారా మొలక శాతం పెరుగుతుందని ప్రతి ఒక్కరూ విత్తన శుద్ధి చేయాలని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ శివ నారాయణ పేర్కొన్నారు. గురువారం దిన్నెపాడు గ్రామంలో వేరుశనగ పంటను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు అనుకూలంగా పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ ఉత్పత్తులు మార్గదర్శకాలు గురించి ఆయన వివరించారు. వేరుశనగ విత్తన పైలటైజేషన్ కోసం ప్రక్రియను ప్రత్యక్షంగా ఆయన పరిశీలించి విత్తన శుద్ధి చేస్తే ఎలాంటి చీడపీడలకు చోటు ఇవ్వకుండా మంచి దిగుబడులు పొందవచ్చు అన్నారు.అంతేకాకుండా విత్తన శుద్ధి చేసిన మొక్క కూడా బాగా పెరుగుతుంది అన్నారు. మంచి దిగుబడులు కూడా వస్తాయన్నారు. వేసవిలో దుక్కులు చేసి సేంద్రీయ ఎరువులను పొలంలో చల్లాలన్నారు. రసాయ నిక ఎరువులు పూర్తిస్థాయిలో తగ్గించి ప్రకృతి ఎరువులు పై మొగ్గు చూపాలన్నారు. పురుగుల మందుల వినియోగాన్ని తగ్గించి జీవామృతం పంచగవ్య కాంపోస్టు వంటి సహజ పద్ధతులను ఉపయోగించాలన్నారు. చాలామంది రైతులు ఎక్కువగా రసాయనిక ఎరువులు వాడితే భూమిలోని సారవంతం తగ్గి రెండో పంటకు దిగుబడులు సక్రమంగా రావన్నారు. భూ పరీక్షలు నిర్వహించి పంట మార్పు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చు అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం మోహన్ మండల వ్యవసాయ అధికారి రాజకుమారి, జెడ్పియన్‌ఎఫ్ సిబ్బంది ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా ఖజానా ఆదాయం పెంపే లక్ష్యం!

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి!!.
- జీఎస్టీ వసూళ్లపై ప్రత్యేక దృష్టి
- జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** జిల్లా ఖజానాకు ఆదాయం పెంపు కోసం అన్ని ఆదాయార్జన శాఖలు సమన్వయంతో పని చేసి లక్ష్యాలను అధిగమించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం మదనపల్లి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఎక్సైజ్, కమర్షియల్ టాక్స్, రవాణా, మైనింగ్, రిజిస్ట్రేషన్, అటవీ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ శాఖల వారీగా ఆదాయ సాధన పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పన్నుల వసూళ్లలో పారదర్శకత, సమర్థత పెంపుతో పాటు ఆదాయ వృద్ధి సాధించడం లక్ష్యంగా అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. మున్సిపల్, పంచాయతీరాజ్ పనుల్లో జీఎస్టీ వసూళ్లు తప్పనిసరిగా జరిగేలా చూడాలని, బిల్లులు ప్రాసెస్ చేసే సమయంలో జీఎస్టీ యాక్టివ్ స్థితిని పరిశీలించాలని ఆదేశించారు. జిల్లాలో జరిగే పనులకు ఉపయోగించే ఇంధనాన్ని రాష్ట్రంలోనే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అక్రమ మద్యం రవాణాపై కట్టుదిట్టమైన నిఘా**

ఎక్సైజ్ శాఖపై సమీక్షిస్తూ, మద్యం దుకాణాలు, బార్లలో సీసీటీవీల పనితీరును పర్యవేక్షించి అవకతవకలు జరగకుండా చూడాలని చెప్పారు. పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు నుంచి అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకోవాలని, దీనిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.



**జీఎస్టీ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమాలు**

మండల అభివృద్ధి అధికారులు, గ్రామపంచాయతీలకు జీఎస్టీ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పించి, అందరూ రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**రెవెన్యూ వింగ్'తో ప్రత్యేక మానిటరింగ్**

కెఆర్ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో "రెవెన్యూ వింగ్" ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి, రోజువారీ పురోగతిని సమీక్షించాలని సూచించారు. ప్రతి వారం బిల్లుల వివరాలను సేకరించి కమర్షియల్ టాక్స్ శాఖతో మరియు ఇతర శాఖల మధ్య సమన్వయం పెంపొందించాలని సూచించారు. మైన్స్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, రవాణా, అటవీ తదితర శాఖలు తమ లావాదేవీలను క్రమబద్ధంగా నమోదు చేసి పన్నుల వసూళ్లను పెంచాలని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రెవెన్యూ వృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముస్లిం బీసీ-ఇ వర్గాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చుటకు సీఎం చంద్రబాబు కృషి చేయాలి

### - బాకే హాబిబుల్లా, అనంతపురం జిల్లా వైసీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు



**అనంతపురం - సూర్య వాస్తవం :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ముస్లిం సామాజిక వర్గాల స్థితిగతులను మెరుగుపరిచేందుకు 2007లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి చారిత్రాత్మక నిర్ణయం తీసుకొని జి ఒ ఎమ్మెస్. నెంబర్.23 ద్వారా ముస్లింలలోని వెనుకబడిన వర్గాలను బీసీ-ఇ కేటగిరీగా గుర్తించి, 4 శాతం రిజర్వేషన్లు కల్పించి వారికి విద్యా, ఉద్యోగ రంగాల్లో అండగా నిలిచారు. అయితే, రాష్ట్ర స్థాయిలో ఈ రిజర్వేషన్లు ఉన్నా ఈ వర్గాలను ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వ ఓబీసీ జాబితాలో చేర్చకపోవడం వల్ల రాష్ట్ర వెనుక బడిన ముస్లిం యువతకు తీరని అన్యాయం జరుగుతోంది.


రాష్ట్రంలో బీసీ-ఇ హోదా ఉన్నప్పటికీ, కేంద్ర జాబితాలో లేకపోవడం వల్ల కేంద్ర ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో మరియు యూపీఎస్సీ, రైల్వే, బ్యాంకింగ్ వంటి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వెనుకబడిన ముస్లింలకు సరైన అవకాశాలు దక్కడం లేదు, ?ప్రస్తుతం కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో నారా చంద్రబాబు నాయుడు కీలక భాగస్వామిగా ఉన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామని అన్నారు. గతంలో బీసీ కమిషన్ చైర్మన్ దళవాయి సుబ్రహ్మణ్యం ముస్లింల వెనుకబాటుతనంపై క్షేత్రస్థాయిలో పర్యటించి ఒక సమగ్ర నివేదికను రూపొందించారు. ఈ నివేదికను ప్రామాణికంగా తీసుకుని కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖకు తక్షణమే ప్రతిపాదనలు పంపాలని కోరుతున్నామని అన్నారు. కేంద్ర గెజిట్‌లో వీటిని చేర్చడం ద్వారా భవిష్యత్తులో ఈ కోటాకు పూర్తిస్థాయి న్యాయపరమైన రక్షణ లభిస్తుంది.

**ప్రధాన డిమాండ్లు :**

రాష్ట్రంలోని ముస్లిం బీసీ-ఇ వర్గాలను తక్షణమే కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలి.?దళవాయి సుబ్రహ్మణ్యం కమిషన్ నివేదికను తక్షణమే కేంద్రానికి పంపి, ఆమోదం పొందేలా ముఖ్యమంత్రి వ్యక్తిగత చొరవ తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు బీసీ-ఇ విద్యార్థులకు అందేలా చర్యలు చేపట్టాలి. వెనుకబడిన ముస్లిం వర్గాల అభ్యున్నతికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు

## నిందితులను కఠినంగా శిక్షించాలి

### - బాధితుడు చెన్నంపల్లి ఫక్రుద్దీన్



**కడప - సూర్య వాస్తవం:** వేంపల్లి మక్కా మసీదు కమిటీలో గది బాడుకకు తీసుకొని 20 సంవత్సరాలుగా ఉన్న తనను అన్యాయంగా ఖాళీ చేయించి తనపై దాడి చేశారని బాధితుడు చెన్నంపల్లి ఫక్రుద్దీన్ అనే మైనార్టీకి చెందిన వృద్ధుడు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారము కడప నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మసీదు కమిటీ సభ్యులు సాధకువల్లి మహమ్మద్ గౌస్ మరికొందరు కుట్రతో తాను బాడుగకు ఉన్న రూములు ఖాళీ చేయించారని తెలిపారు. వాళ్ల బంధువులుకు తన రూమును అప్పజెప్పాలని దురుద్దేశంతో దాదాపు 20 మంది వ్యక్తులతో వచ్చి 2016లో రూమ్‌లో ఉన్న సామాన్లంతా బయట వేసి మా పరువు తీశారు న్నారు. తర్వాత వేంపల్లి పోలీస్ స్టేషన్ 12 మంది మీద కేసు నమోదు చేసి కోర్టుకు అప్పగించడం జరిగిందన్నారు. ఈనెల 23వ తేదీన పులివెందుల మెజిస్ట్రేట్ వారు నాపై దాడి చేసిన మర్మస్ మసీదు కమిటీ సభ్యులు 12 కు చట్టపకారం శిక్ష వేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ న్యాయవాది మధుసూదన్ ఆచార్య తన తరపున బలమైన వాదనలు వినిపించి న్యాయం చేశారన్నారు. కానీ నా పైన జరిగిన దాడిలో ప్రధానమైన వ్యక్తులు బంగారు రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త షేక్ సాధకువల్లి,ఎంజి హోమ్ నీడ్స్ షేక్ మొహమ్మద్ గౌస్లు తప్పించుకున్నారని తెలిపారు. వీరి స్థానంలో అమాయకులకు శిక్ష పడడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ఇద్దరు వ్యక్తులను ఉన్నతాధికారులు చట్టపకారం కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.



## సయ్యద్ షరీఫ్ జ్యువలరీ షాపును ప్రారంభించిన సుగవాసి ప్రసాద్ బాబు

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** రాయచోటి పట్టణంలోని గాంధీబజార్ సమీపంలో గల సురభి పచ్చారు అంగడి ప్రక్కన నూతనంగా ఏర్పాటు చేసిన 'సయ్యద్ షరీఫ్ జ్యువలరీ షాప్'ను రాజంపేట పార్లమెంట్ టీడీపి అధ్యక్షులు, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు గురువారం ఘనంగా ప్రారంభించారు. షాప్ యాజమాన్యం షరీఫ్ గారి ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన, విక్రయాలను ప్రారంభించారు. అనంతరం ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు నాణ్యమైన ఆభరణాలను అందు బాటులోకి తీసుకురావడం అభినందనీయమని, నూతనంగా ప్రారంభించిన ఈ సంస్థ మరిన్ని శాఖలతో అభివృద్ధి చెందాలని కోరారు. షరీఫ్, వారి కుటుంబ సభ్యులకు ఆయన తన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


# పాటతో అడ్డంగా బుక్కైన శ్రుతిహాసన్!



శ్రుతి హాసన్‌- మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ మధ్య ఉన్న స్నేహం గురించి చాలా తక్కువ మందికి తెలుసు. వీరిద్దరూ చిన్నప్పుడు చెన్నైలోని ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో శ్రుతి హాసన్ తన స్కూల్ రోజులను గుర్తు చేసుకుంటూ దుల్కర్ తనను సోంబీ అని పిలుస్తూ ఎలా ఆటపట్టించేవాడో గుర్తు చేసుకుంది. శ్రుతి హాసన్ కు చిన్నప్పటి నుండి సంగీతంపై అమితమైన ఆసక్తి. దీంతో స్కూల్ రోజుల్లో ఒకసారి స్టేజ్ మీద ఆమె -సోంబీ- ఒక పాపులర్ సాంగ్‌ను పాడారు. ఆ పాట పాడే క్రమంలో ఆమె పలికించిన హావభావాలు, ఆ గొంతులో ఉన్న తీవ్రత చూసి స్కూల్ ఫ్రెండ్స్ అందరూ ఆశ్చర్యపోయారు. అప్పటి నుండి దుల్కర్ సల్మాన్ ఆమెను ఆటపట్టించడానికి -సోంబీ- అనే నిక్ నేమ్ పెట్టేశాడట. -నేను ఆ పాటను ఎంతో ఇష్టపడి పాడాను. కానీ దుల్కర్ మాత్రం నన్ను చూసి నువ్వు నిజంగానే సోంబీలా ఉన్నావు అంటూ ఏడిపించేవాడు. స్కూల్ కారిడార్లలో నన్ను చూసినప్పుడల్లా -సోంబీ.. సోంబీ- అని పిలిచేవాడు. అలా ఆ ఒక్క పాటతో నేను మా స్కూల్ బ్యాచ్ మొత్తానికి సోంబీగా బుక్ అయిపోయాను- అని శ్రుతి నవ్వుతూ చెప్పుకొచ్చారు. ఒక స్టార్ కిడ్ అయి ఉండి కూడా తన పాత జ్ఞాపకాలను ఇంత ఓపెన్‌గా పంచుకోవడం అభిమానులను ఆకట్టుకుంటోందే! దుల్కర్ సల్మాన్ కూడా పలు సందర్భాల్లో శ్రుతి హాసన్ గురించి ప్రస్తావిస్తూ - ఆమె చిన్నప్పటి నుండి చాలా టాలెంటెడ్ అని ఏదైనా పనిని చాలా పట్టుదలగా చేసేదని కొనియాడారు. కేవలం ఆటపట్టించడమే కాకుండా వారిద్దరూ కలిసి స్కూల్ ప్రాజెక్టులలో కూడా పాలుపంచుకునేవారట. ఇప్పుడు ఇద్దరూ పాన్ ఇండియా స్టార్స్‌గా ఎదిగి, వేర్వేరు భాషల్లో రాణిస్తుండటం విశేషం. అయితే దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాదినేని దర్శకత్వంలో -ఆకాశంలో ఒకతార- అనే చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. సాత్విక వీరవల్లి అనే తెలుగు అమ్మాయి హీరోయిన్ గా నటిస్తోంది. ఢిల్లీ వేడుకలో ఆమె కాళ్లకు మొక్కిన బాలయ్య ఇదే చిత్రంలో శ్రుతి హాసన్ ఓ కీలక పాత్రలో నటించడం విశేషం. ఇంత వరకూ శ్రుతిహాసన్- దల్కర్ సల్మాన్ ఏ సినిమాలోనూ కలిసి నటించలేదు. ఆ రకంగా -ఆకాశంలో ఒకతార- ఇద్దరికీ తొలి సినిమా అవుతుంది. ప్రస్తుతం శ్రుతి హాసన్ మ్యూజిక్ కంటే నటనకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి పని చేస్తోంది. అయితే మునుపటిలా నటిగా అవకాశాలు అందుకో లేకపోతుంది. కొత్త భామలు రావడం..వారు సక్సస్ అవ్వడంతో రేసులో బాగా వెనుకబడుతోంది. ప్రస్తుతం తెలుగులో -సలార్ 2- ఒక్కటే కమిట్ అయింది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కావడానికి ఇంకా సమయం పడుతుంది. అలాగే రిలీజ్ అవ్వడానికి రెండేళ్లు సమయం పడుతుంది. మరి ఈలోగా మరో తెలుగు సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తుందా? అన్నది చూడాలి.

## ప్రభాస్ అంటే నమ్మకం..

### ఒకసారి తనవాళ్లు అంటే జీవితాంతం తోడే!



టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ మనసు వెన్న అని అందరికీ తెలిసిందే. కేవలం వెండితెరపైనే కాదు, నిజ జీవితంలోనూ ఆయన ఒక 'డార్లింగ్'. ముఖ్యంగా తనను నమ్మిన వారికి, తన సన్నిహితులకు అండగా నిలవడంలో ఆయనకు సాటి ఎవరూ లేరు. దివంగత దర్శకుడు శోభన్ కుమారులైన సంతోష్ శోభన్, సంగీత్ శోభన్ కెరీర్‌ను ప్రభాస్ వెనకుండి నడిపిస్తున్న తీరు చూస్తుంటే, స్నేహానికి ఆయన ఇచ్చే విలువ ఏంటో అర్ధమవుతుంది. తాజాగా సంగీత్ శోభన్ చేసిన వ్యాఖ్యలు ప్రభాస్ వ్యక్తిత్వాన్ని మరోసారి చాటిచెప్పాయి. ఆ వివరాలు ఇలా వున్నాయి.. సంతోష్ శోభన్, సంగీత్ శోభన్.. ఈ ఇద్దరు కుర్ర హీరోలు నేడు టాలీవుడ్‌లో తమకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారంటే దానికి ప్రధాన కారణం ప్రభాస్ ఇచ్చిన సపోర్ట్. దర్శకుడు శోభన్ రూపొందించిన 'వర్షం' సినిమా ప్రభాస్ కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆ కృతజ్ఞతతోనే ప్రభాస్ వారి కుమారులకు కెరీర్ ఆరంభం నుండి గట్టి పుష్ ఇస్తూ వస్తున్నారు. ఇక యూవీ క్రియేషన్స్ వంటి పెద్ద బ్యానర్‌లలో అవకాశాలు ఇప్పించడమే కాకుండా, తన సర్కిల్‌లోని నిర్మాతలకు కూడా వీరిని రికమెండ్ చేస్తూ ఒక అన్నలా వెన్నంటి ఉంటున్నారు.సంగీత్ శోభన్ నటించిన 'రాకస' సినిమా ఏప్రిల్ 3న విడుదల కానున్న నేపథ్యంలో, ఆయన ప్రభాస్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "చాలామంది వర్షం సినిమా హిట్ కాబట్టే ప్రభాస్ అన్న మాకు సపోర్ట్ చేస్తున్నారని అనుకుంటారు. కానీ ఆ సినిమా ఒకవేళ ఫ్లాప్ అయినా సరే ఆయన మాకు ఇలాగే సాయం చేసేవారు" అని సంగీత్ గట్టిగా చెప్పారు. ఇక ప్రభాస్ క్యారెక్టర్ అలాంటిదని, తన మనుషులు అనుకుంటే విజయాపజయాలతో సంబంధం లేకుండా జీవితాంతం తోడుంటారని ఆయన చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సంతోష్ శోభన్ కెరీర్ చూస్తే మనకు ఇది స్పష్టంగా అర్థమవుతుంది. 2015లో కెరీర్ స్టార్ట్ చేసిన సంతోష్‌కు సరైన కమర్షియల్ సక్సెస్ రావడానికి చాలా సమయం పట్టింది. దాదాపు 10 సినిమాలు చేసినా, మొన్నటి 'కపుల్ ఫ్రెండ్లీ' వరకు ఆయనకు పెద్ద హిట్ దక్కలేదు. ప్రభాస్ కేవలం బాహుబలి మాత్రమే కాదు, ఒక గొప్ప మనసున్న మనిషి అని ఈ సోదరుల విషయంలో నిరూపితమైంది. సినిమా రిజల్ట్‌తో సంబంధం లేకుండా ఒక వ్యక్తిని నమ్మడం, వారికి అండగా నిలబడటం అనేది ఈ రోజుల్లో చాలా అరుదు. ప్రభాస్ చూపిస్తున్న ఈ ఆప్యాయత చూస్తుంటే, ఆయన ఎందుకు అందరికీ 'డార్లింగ్' అయ్యారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. సంగీత్ శోభన్ నటిస్తున్న 'రాకస' కూడా మంచి విజయం సాధించాలని, ఈ అన్నదమ్ములు ఇండస్ట్రీలో మరిన్ని శిఖరాలను అధిరోహించాలని కోరుకుందాం.

# వరల్డ్ కప్ హ్యాంగోవర్..

### - అంతర్జాతీయ ఉద్రిక్తతల ప్రభావం.. ఐపీఎల్‌పై ఆసక్తి తగ్గుదల



ఐపీఎల్ అంటే ఒకప్పుడు దేశవ్యాప్తంగా పండుగ వాతావరణం. మ్యాచ్‌లు ప్రారంభం కావడానికి ముందే అభిమానుల్లో ఉత్సాహం ఉప్పొంగేది. టికెట్ల కోసం పోటీ, సోషల్ మీడియాలో చర్చలు, టీమ్‌లపై అంచనాలు.. ఈ అన్నీ కలిపి ఐపీఎల్‌ను ఒక ప్రత్యేక బ్రాండ్‌గా నిలబెట్టాయి. కానీ 2026 సీజన్ ప్రారంభానికి ముందు కనిపిస్తున్న పరిస్థితులు మాత్రం పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. మార్చి 28 నుంచి ఐపీఎల్ 2026 ప్రారంభం కానుండగా గతంలో లాగా ఎలాంటి హడావుడి, ఉత్సాహం కనిపించడం లేదు. సోషల్ మీడియా వేదికలలో గానీ, క్రికెట్ అభిమానుల మధ్య గానీ పెద్దగా చర్చలు జరగకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా విడుదలైన ఐపీఎల్ ట్రోఫీతో పాటు 10 జట్ల కెప్టెన్లు ఉన్న ఫోటో మరింత చర్చనీయాంశమైంది.గతంలో ఐపీఎల్ కెప్టెన్ల ఫోటోలు అంటే ఒక ప్రత్యేక ఆకర్షణ ఉండేది. మహేంద్ర సింగ్ ధోని, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజ ఆటగాళ్లు ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయ్యేది. వారి మధ్య ఉన్న పోటీ తత్వం, ఆత్మవిశ్వాసం ఫోటోలోనే ప్రతిబింబించేది. రూ.9 కోట్ల జీతం నుంచి రూ.460 కోట్ల జాక్‌పాట్! ప్రస్తుతం ఉన్న కెప్టెన్లు ప్రతిభావంతులే అయినప్పటికీ గత తరం ఆటగాళ్లలా భారీ ఫాలోయింగ్ లేదా ఆకర్షణీయమైన వ్యక్తిత్వం లేదని సోషల్ మీడియాలో కామెంట్లు వెల్లువెత్తుతున్నాయి. "ఇది ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత నిరుత్సాహకరమైన కెప్టెన్ల ఫోటో కావచ్చు" అంటూ నెటిజన్లు ట్రోల్స్ చేస్తున్నారు. ఇక ఈ సీజన్‌పై హైప్ తగ్గడానికి అంతర్జాతీయ పరిస్థితులూ కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు, చమురు సంక్షోభం ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతున్నాయి.

ఈ పరిస్థితులు ప్రజల దృష్టిని క్రీడల నుంచి మరల్చాయి. అంతేకాకుండా ఇటీవల ముగిసిన టీ20 వరల్డ్ కప్ ప్రభావం ఇంకా పూర్తిగా తగ్గలేదు. వరుసగా పెద్ద టోర్నమెంట్లు రావడంతో అభిమానుల్లో 'క్రికెట్ అలసట' ఏర్పడిందని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభం కానున్నప్పటికీ, ఆశించిన స్థాయిలో

## యువతకు రాయల్స్ పెద్దపీట

- 14ఏళ్ల సూర్యవంశీపైనే అందరి చూపు
- 2008లో టైటిల్ కైవసం
- గత సీజన్‌లో 9వ స్థానంతో వైఫల్యం




**జైపూర్:** రాజస్తాన్ రాయల్స్ యువ క్రికెటర్లకు పెద్దపీట వేసింది. గత సీజన్‌లో 13ఏళ్ల వైభవ్ సూర్యవంశీని ఏకంగా రూ.1.10కోట్లకు కొనుగోలు చేసి అతనిని ఈ సీజన్‌కూ కొనసాగించడమే ఇందుకు నిదర్శనం. 2008 ఆరంభ సీజన్‌లో షేన్ వార్న్ సారథ్యంలో టైటిల్‌ను కొట్టిన రాజస్తాన్.. 2022లో రన్నరప్‌గా నిలిచింది. గత 18 ఐపిఎల్ సీజన్‌లలో ఏకంగా 6సార్లు ప్లే-ఆఫ్స్‌కు చేరింది. 2024 ఐపిఎల్‌లో ప్లే-ఆఫ్స్‌కు చేరి 3వ స్థానంలో సంతృప్తి పరిచినా.. 2025లో 9వ స్థానం నిలిచి నిరాశపరిచింది. ఇక ఈ సీజన్‌కు రాజస్థాన్ రాయల్స్ తీసుకున్న ఒక నిర్ణయం అభిమానుల నుంచి తీవ్ర విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది. 'ఎక్స్‌పీరియన్స్ లేదా యూత్' అన్న ప్రశ్నకు జట్టు మేనేజ్‌మెంట్ ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ.. సంజూ శాంసన్‌ను ట్రేడ్ చేసి చెన్నై సూపర్ కింగ్స్‌కు పంపించడం పెద్ద ట్విస్ట్‌గా మారింది. అతని స్థానంలో స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, ఇంగ్లండ్ ప్లేయర్ సామ్ కర్రన్‌లను తీసుకుంది. జడేజా లాంటి అనుభవజ్ఞుడు జట్టులోకి రావడంతో, అతడే కొత్త కెప్టెన్ అవుతాడని అందరూ భావించారు. కానీ జట్టు మేనేజ్‌మెంట్ మాత్రం అందరి అంచనాలను తలకిందులు చేస్తూ, యువ ఆటగాడు రియాన్ పరాగ్‌ను ఫుల్‌టైమ్ కెప్టెన్‌గా ప్రకటించింది. జడేజాను సపోర్టింగ్ రోల్‌కే పరిమితం చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఈ నిర్ణయంపై టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మాట్లాడుతూ.. జడేజానే కెప్టెన్ అవుతాడని తాను కూడా భావించానని, జడేజాకు కెప్టెన్సీ ఇచ్చి, పరాగ్‌ను వైస్ కెప్టెన్‌గా ఉంచితే జట్టుకు మంచి బ్యాలెన్స్ వచ్చేదని పేర్కొన్నాడు. అలాగే డాషింగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌ను కూడా ఫ్యూచర్ కెప్టెన్‌గా తీర్చిదిద్దాలని సూచించాడు. రియాన్ పరాగ్‌కు లీడర్‌షిప్ అనుభవం లేదని చెప్పలేం. దేశవాళీ క్రికెట్‌లో అసోం జట్టును విజయవంతంగా నడిపించాడు. అయితే ఐపిఎల్ స్థాయి ఇందుకు పూర్తిగా భిన్నం. గత సీజన్‌లో సంజూ శాంసన్ గాయపడిన సమయంలో పరాగ్ తాత్కాలిక కెప్టెన్‌గా వ్యవహరించాడు. కానీ ఆ సమయంలో జట్టు ఆశించిన స్థాయిలో ప్రదర్శన ఇవ్వలేదు. రాజస్థాన్ కేవలం నాలుగు విజయాలతో పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్థానంలో నిలిచిందన్నాడు. హెడ్ కోచ్ కుమార సంగక్కర వ్యూహాత్మకంగా బలమైన మద్దతు అందిస్తాడు. అలాగే క్లిష్ట పరిస్థితుల్లో రవీంద్ర జడేజా అనుభవం కూడా పరాగ్‌కు ఉపయోగపడుతుందన్నాడు. ఈనెల 30న రాజస్తాన్ జట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను చెన్నై సూపర్‌కింగ్స్‌తో తలపడనుంది.

### వైభవ్ సూర్యవంశీపై అందరి కళ్లూ..

14ఏళ్ల యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీపై అందరి కళ్లూ ఉన్నాయి. గత ఏడాది కాలంగా అండర్-19 స్థాయిలో నిలకడగా రాణించిన ఈ కుర్రాడిపై భారీ అంచనాలే ఉన్నాయి. ఈ చిన్నోడు ఈసారి కూడా ఐపిఎల్‌లో రాణిస్తే టీమిండియాలో చోటు ఖాయం. గత ఐపిఎల్ సీజన్‌లో ఏకంగా రూ.1.10 కోట్లు పెట్టి కొనుగోలు చేసింది. అప్పటికి అతడి వయసు 13ఏళ్లే. గత సీజన్‌లో బలమైన బౌలింగ్ లైనప్ ఉన్న గుజరాత్ టైటాన్స్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగాడు. రాజస్తాన్ రాయల్స్ ఆటగాళ్లు: రియాన్ పరాగ్(కెప్టెన్), జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, జడేజా, సందీప్ శర్మ, మిల్నే, ధ్రువ్ జురెల్, ఫెరైరా(వికెట్ కీపర్లు), సామ్ కర్రన్, శనక, ఆర్చర్, హెట్‌మైర్, దేశ్‌పాండే, బర్గర్, కుల్దీప్ సేన్, బిష్ణోరు, సుశాంత్ మిశ్రా, శుభమ్ దూబే, దిగ్వేష్, అమన్ రావు, మాఫకా, యశ్ పంజా, ప్రెటోరియస్, రవి సింగ్, బ్రిజేశ్ శర్మ.

# గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

- ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలి
- ఆరోగ్యశాఖ సమీక్షలో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్





**అనంతపురం- సూర్య వాస్తవం :** జిల్లా పరిధిలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే ప్రభుత్వ నిబంధనల మేరకు కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ హెచ్చరించారు. అలాగే వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పిసి మరియు పిఎన్డిటి ఆక్ట్ అమలుపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రా ప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం తో పాటు ఆరోగ్యశాఖ పనితీరుపై వేరువేరుగా జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఉన్న స్కానింగ్ సెంటర్ లు చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ చర్యలకు పాల్పడితే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఆరోగ్య,పోలీసు శాఖలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో స్కానింగ్ కేంద్రాలపై నిరంతర గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. తనిఖీ చేసిన స్కానింగ్ కేంద్రాలలో ఏవైనా లోపాలు ఉన్నట్లు గుర్తించినట్లయితే ఆయా కేంద్రాలపై నిబంధనలు ఉల్లంఘించినందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. వచ్చే త్రైమాసికి లో తప్పక కేసులు నమోదు చేయాలని , నిబంధనలు ఉల్లంఘించి అబార్షన్ మందులు అమ్మిన అలాంటి మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయుచున్న స్కానింగ్ కేంద్రాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మరి ముఖ్యంగా వైద్య ఆరోగ్య మరియు శిశు సంక్షేమ శాఖ లు సమన్వయంతో క్షేత్రస్థాయిలో ఆడపిల్లలు ఉన్న కుటుంబాల గృహాలను సందర్శించి బాలికా విద్య, బాల్య వివాహాల నిర్మూలన లింగ వివక్షతను రూపు మాపడం పై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లాలో మరో 10 స్కానింగ్ సెంటర్లు నిర్వహించుకునేందుకు అనుమతి మంజూరు తో పాటు అదేవిధంగా గడువు తీరిన14 స్కానింగ్ సెంటర్ లకు రెన్యువల్ చేస్తూ తీర్మానం , 21 స్కానింగ్ సెంటర్ల మార్పులు చేర్పులకు అనుమతులు మంజూరు చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఈ .బి .దేవి, ఆర్ జి టి హెల్త్ డైరెక్టర్ డా. దుర్గేష్, పోలీస్ ఎస్ఐ విజయభాస్కర్, డెమో నాగరాజు, డిప్యూటీ డెమో లక్ష్మీనారాయణ, హెచ్ ఇ ఓ గంగాధర్, లీగల్ అడ్వైజర్ ఆషారాణి మరియు డెమో సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి....**

అనంతరం వివిధ విభాగాల వైద్య అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ ప్రస్తుత వేసవికాలంలో ఎండలు తీవ్రత పెరుగుతున్నందున వైద్య సిబ్బంది అన్ని స్థాయిలోనూ ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్ని ఆసుపత్రులలో ఓఆర్ఎస్ ను అందుబాటులో ఉంచాలని అలాగే ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా వడదెబ్బకు ప్రజలు గురైనచో వారిని వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రులకు చేర్పించి వైద్య సేవలు అందించాలని, అలాగే కలుషిత నీరు ఆహారం వల్ల అనారోగ్యం పాలు అయ్యే అవకాశం లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా నీరు నిలువ లేకుండా చూసుకోవడం దోమలు పెరగకుండా నీటి నిల్వాలపై ఆయిల్ బాల్స్ వేయడం , ఫాగింగ్ చేయడం తదితర చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

మరి ముఖ్యంగా టీ బి ,లెప్రసీ, హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధుల నివారణ కోసం చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణుల ప్రసవాల విషయంలో సాధ్యమైనంత వరకు ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలతో పాటు సాధ్యమైనంత వరకు సిజరిన్ నివారించి సాధారణ ప్రసవాలు అయ్యేలాగా చూడాలన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెల కనీసం 10 డెలివరీ తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. శిశు మరణాలు మాతృ మరణాలు విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ కనపరిచి వాటిని నివారించాలన్నారు. నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ సంబంధించి క్యాన్సర్ నివారణ కోసం స్క్రీనింగ్ నిర్వహించాలని అలాగే క్యాన్సర్ నివారణ కోసం అన్ని చర్యలను వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈ బి దేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ సెల్వారాజ్ పోగ్రామ్ అధికారులు డాక్టర్ శశిభూషణ్ రెడ్డి, డాజయలక్ష్మి డా.శ్రీనివాసరెడ్డి డా.విష్ణుమూర్తి డి ఎం ఓ ఓబులు, ఎస్ ఓ మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

## రజత కాంతుల్లో మెరిసిపోతున్న
# ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవ శోభ






**కడప ఒంటిమిట్ట - సూర్య వాస్తవం :** ఒంటిమిట్టలోని పవిత్రక్షేత్రమైన శ్రీ కోదండరామస్వామి ఆలయంలో జరగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల హృదయాలను పరవశింపజేసేలా టిటిడి అత్యంత వైభవంగా విద్యుత్ అలంకరణలను చేపట్టింది. వెన్నెలను తలపించే వెలుగుల మధ్య ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక ఆనందాన్ని ప్రసరింపజేస్తూ భక్తులకు దివ్యాను భూతిని అందిస్తున్నాయి.ఒంటిమిట్ట ఆలయం లోపల, వెలుపల ప్రాంతాలు, పరిసర ప్రాంతాలు, టిటిడి భవనం, వాహన మండపం, ఆలయం ముందు గార్డెన్, ప్రధాన కూడళ్లు, అలాగే ఒంటిమిట్ట నుండి మాధవవరం వరకు మార్గమంతా విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. నాలుగు మాడ వీధులు, పుష్కరిణి, పార్కింగ్ ప్రాంతం, ఒంటిమిట్ట పరిసర ప్రాంతాలు, కల్యాణ వేదిక తదితర ప్రాంతాలు రాత్రివేళల్లో రజత కాంతులతో మెరిసిపోతూ బ్రహ్మోత్సవాలకు అపూర్వమైన శోభను చేకూర్చుతున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా 30కి పైగా దేవతామూర్తుల పెద్ద బొమ్మలు, 70కు పైగా ప్రత్యేక డిజైన్ బోర్డులు, అలాగే అనేక అద్భుత ఇల్యూమినేషన్ బోర్డులను ఏర్పాటు చేశారు. దేవాతామూర్తుల పెద్ద బొమ్మలలో శ్రీరామ పట్టాభిషేకం, శ్రీరామ కల్యాణం, అయోధ్య రాముడు, రామబాణం, ఏనుగు మీద శ్రీవారు, గరుత్మంతుడిపై శ్రీవారు, శ్రీ పద్మనాభ స్వామి, అమ్మవారి త్రీడీ రూపం, శ్రీరాముడు -- శబరి, దశావతారాలు, అష్టలక్ష్ములు వంటి దివ్యరూపాలు విద్యుత్ కాంతుల్లో ప్రకాశిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక సౌందర్యాన్ని పంచనున్నాయి. అదేవిధంగా 20 వేల సీరియల్ లైట్స్, 10 వేల ఫ్లడ్ లైట్లు, 500 రంగు రంగుల లైట్లు, 40 జనరేటర్లు, వివిధ రకాల తోరణాలతో ఒంటిమిట్ట అంతా ప్రకాశవంతంగా మారి బ్రహ్మోత్సవాల వైభవాన్ని మరింత పెంచనున్నాయి.

**ప్రత్యేక ఆకర్షణగా కల్యాణ వేదిక**

ఏప్రిల్ 1న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు వేలాది మంది భక్తులు తరలి రానున్నారు. వారి సౌకర్యార్థం కల్యాణ వేదిక పరిసరాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతం మరియు ఆలయ పరిసరాల్లో 24 ఎల్.ఈ.డి వీడియో డిస్ప్లే బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. వీటి ద్వారా భక్తులు ఎక్కడి నుంచైనా శ్రీ సీతారాముల దివ్య కల్యాణాన్ని కనులారా వీక్షిస్తూ భక్తి పరవశంలో తేలియాడేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## శాంతియుతంగా సంతోషంగా
# శ్రీరామనవమి పండుగ జరుపుకోవాలి

- మీ పరిధిలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా తప్పకుండా పోలీసు వారి అనుమతి తీసుకోవాలి
- ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు
- జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** శ్రీరాముని ఆదర్శాలను స్మరించుకుంటూ.. ధర్మం, న్యాయం, ప్రేమ, కరుణ ఆయన జీవితంలోని ముఖ్యమైన అంశాలు. వీటిని మన జీవితాల్లో ఆచరించాలని, జిల్లా ఎస్పీ, శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ మాట్లాడుతూ.. ప్రజలందరూ శాంతియుతంగా, సంతోషంగా, శ్రీరామనవమి పండుగ జరుపు కోవాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అందరూ పోలీసులకు సహకరించాలని, "మీ భద్రత మాకు ముఖ్యం" కాబట్టి ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. మీ పరిధిలో మీరు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా స్థానిక పోలీస్ స్టేషన్లో తప్పకుండా అనుమతి తీసుకోవాలి. ఇది మీ భద్రతకు, అలాగే ఆ ప్రాంతంలోని ప్రజలందరి భద్రతకు చాలా ముఖ్యం. మీరు అనుమతి తీసుకోవడం ద్వారా పోలీసులు ఆ కార్యక్రమం గురించి తెలుసుకుంటారని, అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేస్తారని, తద్వారా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నివారించగలుగుతారని, కాబట్టి ఏదైనా కార్యక్రమం నిర్వహించేముందు పోలీసుల అనుమతి తీసుకోవడం బాధ్యతాయుతమైన పౌరులుగా మీ కర్తవ్యం అని ఎస్పీ తెలిపారు. ప్రజలందరూ శాంతియుతంగా సంతోషంగా శ్రీరామనవమి పండుగ జరుపుకోవాలని, అత్యవసరం అయితే వెంటనే స్తానిక పోలీస్ స్టేషన్ లేదా 112 నెంబర్ కు డయల్ చేయాలని జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ గారు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పండుగ సందర్భంగా.. డీజే లాంటి కార్యక్రమాలను నిర్వహించరాదని, సాంప్రదాయ పద్ధతిలో పండుగ జరుపు కోవాలని, మైనర్లకు బైకులు ఇచ్చిన తల్లిదండ్రులు సంరక్షకులపై కేసులు నమోదు చేయాలని, ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తూ.. సైలెన్సర్లు తీసివేసి బైకులు నడుపుతున్న వారిపై చర్యలు తీసు కోవాలని, జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజలందరికీ పోలీసు లకు వారి కుటుంబ సభ్యులకు ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా సోదరులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఏ రెన్యువల్ సాధించడంలో
# తలారి రంగయ్య కృషి అమోఘం
### - వైసీపీ నాయకుల ప్రశంసలు



**అనంతపురం - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లాలోని ప్రముఖ స్వచ్ఛంద సంస్థ ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం నుండి ఎఫ్‌సిఆర్‌ఏ రెన్యూవల్ లభించడంలో కీలక పాత్ర పోషించిన మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్యను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.బుధవారం నాడు అనంతపురంలోని ఆయన క్యాంపు కార్యాల యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు రంగయ్యను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అనంతపురం జిల్లాలో పేదలకు, అట్టడుగు వర్గాలకు అండగా నిలిచే ఆర్డీటీ సంస్థకు నిధుల సేకరణలో ఎదురైన సాంకేతిక ఇబ్బందులను అధిగమించడంలో తలారి రంగయ్య ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని కొనియాడారు. ఢిల్లీ స్థాయిలో హోంశాఖ మంత్రి అమిత్ షా, సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరిపి, ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యువల్ అయ్యేలా ఆయన చేసిన కృషి జిల్లా ప్రజలకు, సంస్థ సేవలు అందుకుంటున్న పేదలకు ఎంతో మేలు చేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రంగయ్యను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి తమ కృతజ్ఞతలు తెలిపారు.రంగయ్యను సన్మానించిన వారిలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ సోమర జయచంద్ర నాయుడు, వైసీపీ సీనియర్ నాయకులు మన్నెల సత్యనారాయణ, 25 డివిజన్ కన్వీనర్ విజయ సింహారెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హుస్సేన్ పీరా, సిద్ధ రాచర్ల సర్పంచ్ రామాంజనేయులు, వైసిపి నాయకులు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

# పేద పిల్లలకు పాదరక్షలు పంపిణీ
### -120 జతల షూ ఉచితంగా అందజేత




**రాయచోటి-సూర్య వాస్తవం:** ప్రస్తుతం కాస్తున్న ఎండలు వేసి వేసవిని దృష్టిలో పెట్టుకొని సంబేపల్లి మండలంలోని మారుమూల ప్రాంతాలైన అడవికమ్మ పల్లె మోడల్ ప్రాథమిక పాఠశాల, గాండ్లపల్లి ప్రాథమిక పాఠశాల, దిగువ మాదిగ పల్లె ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దాదాపుగా పాదరక్షలు, (షూ) కలిపి 120 జతలను ఉచితంగా లయన్స్ క్లబ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగిందని అధ్యక్షులు లయన్ శ్యామ్ తెలియజేశారు. ఈ సందర్భంగా లయన్ వ్యవస్థాపకుడు పి ఎస్ హరినాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా దృక్పథం అలవర్చుకోవాలని అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యం ఏదో ఒక కార్యక్రమం పేద ప్రజల కోసం పేద విద్యార్థుల కోసం అవసరమైన సందర్భంలో లయన్స్ క్లబ్ స్పందిస్తూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ రీజియన్ చైర్మన్ షేక్ మహమ్మద్ భాష ప్రధాన కార్యదర్శి ,ప్రధానోపాధ్యాయులు శివారెడ్డి, హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు పూజారి రమణయ్య, గణిత ఉపాధ్యాయులు ఆనంద రెడ్డి ఎస్టియు మండల అధ్యక్షులు ధనుంజయ రెడ్డి, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి ఉపాధ్యాయులు అశోక్ రెడ్డి, నాగరాజా చారి స్థానికులు విద్యార్థులు పాల్గొన్నారు.

# దశాబ్దాలుగా రోడ్లు లేని గ్రామాలకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ
### - రూ. 20 లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణం
### - పరిశీలించిన నియోజకవర్గ టిడిపి నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం :** మండలంలోని బండపల్లి గ్రామం పుత్తుకూరుపల్లె మెయిన్ రోడ్డు నుండి నందివాండ్ల పల్లె గ్రామ ప్రజలు గత దశాబ్ద కాలంగా రోడ్డు లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి వెంటనే రూ. 20 లక్షలు రూపాయలు నిధులతో సిసి రోడ్డు వేయించడం జరిగింది.. ఈరోజు నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి రోడ్డును పరిశీలించి, నియోజకవర్గంలోనే ప్రతి మారుమూల గ్రామానికి రోడ్లు మరియు మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు...



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR,
ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )